

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (బుధవారం సాయంత్రం)	సెహరీ (గురువారం ఉదయం)
కడప	6.31	5.05
ప్రొద్దుటూరు	6.32	5.09

పేదలకు అధనం

- బీసీ, ఎస్సీ, ఎస్టీల ఇళ్ల నిర్మాణానికి అదనపు సాయం
- రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం
- 2019-24 హయాంలో మంజూరైన ఇళ్ల పూర్తికి చర్యలు

(కడప-ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ సొంతిల్లు నిర్మించుకోవాలనే కల ఉంటుంది. కొందరి జీవితంలో ఆ కల నెరవేరదు. అందుకే టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కూడు, గూడు, గుడ్డ కాన్సెప్ట్‌తో పాలన సాగించింది. పక్కాగృహాలకు దివంగత ఎన్టీఆర్ హయాంలోనే శ్రీకారం చుట్టారు. అదే ఒరవడిని సీఎం చంద్రబాబు కొనసాగిస్తున్నారు. ప్రతి ఒక్కరికీ ఇల్లు కట్టిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతోంది. పట్టణాలు, పల్లెల్లో ఇంటి స్థలాలతో పాటు పక్కాగృహాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. కేవలం టీడీపీ హయాంలో ఇచ్చారనే నెపంతో 2014-19 కాలంలో మంజూరైన ఇళ్లకు జగన్ అండ్ కో బిల్లులు ఇవ్వకుండా నిలిపివేసింది. దాదాపు పూర్తయిన టిడ్కో ఇళ్లనూ పేదలకు ఇవ్వలేదు. ఇప్పుడు పేదోడి గూడు కలను సాకారం చేసేందుకు చంద్రబాబు ప్రభుత్వం ముందుకు వెళుతోంది. 2014-19 హయాంలో ఇళ్లు మంజూరై వివిధ దశల్లో ఆగిపోయిన వాటిని పూర్తి చేసేందుకు బిల్లులు ఇవ్వడంతో పాటు వైసీపీ హయాంలో మంజూరైన ఇళ్లను పూర్తి చేసేందుకు అదనపు సాయం ఇవ్వాలని నిర్ణయించింది. జగన్ హయాంలో జిల్లాలో 89వేల ఇళ్లు మంజూరైతే సుమారు 30వేల ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. మిగతావన్నీ నిలిచిపోయాయి. వాటిని పూర్తి చేసేందుకు చంద్రబాబు సర్కారు నడుం బిగించింది. ఇంటి నిర్మాణానికి ఇచ్చే రూ.1.80లక్షలే కాకుండా బీసీ, ఎస్సీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు అదనపు సాయం అందించాలని నిర్ణయించింది. దీంతో జిల్లాలో 25,212 మందికి లబ్ధి చేకూరనుంది.



నిర్మాణంలో ఉన్న ఇల్లు

పేదలకు వరం



ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ గూడు కల్పించాలన్న లక్ష్యంతో ముందుకు వెళుతోంది. ఎస్సీ ఎస్టీ బీసీలను ఆదుకునేందుకు ప్రత్యేక అదనపు సాయం అందిస్తోంది. ఇది నిజంగా పేదలకు ఓ వరం. ఈ అదనపు ఆర్థిక సాయంతో ఇళ్లు నిర్మించుకోవాలి. బీసీ, ఎస్సీలకు 50వేలు, ఎస్టీలకు 75వేలు ప్రభుత్వం అందిస్తుంది. దీనిని సద్వినియోగం చేసుకోవాలి.

- వేమా రాజారత్నం, హౌసింగ్ పీడీ

అదనపు సాయంతో పేదలకు భరోసా

రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే జూన్ నాటికి 3లక్షల ఇళ్లు (టిడ్కో ఇళ్లతో కలిపి) పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలనే లక్ష్యంగా సీఎం చంద్రబాబు ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగా జిల్లాకు పదివేల ఇళ్లు టార్గెట్‌గా ఇచ్చారు. ఈ మేరకు కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, హౌసింగ్ పీడీ లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఇళ్ల నిర్మాణం పూర్తి చేసేందుకు వెంటపడుతున్నారు. ఇక అదనంగా బీసీ, ఎస్సీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు రావడంతో అసంపూర్తి ఇళ్లను పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

25వేల మందికి లబ్ధి:

నియోజకవర్గం	ఎస్సీ	ఎస్టీ	బీసీ	మొత్తం
బద్వేలు	863	67	1,175	2,105
మైదుకూరు	566	72	956	1,594
పులివెందుల	533	119	1180	1,832
జమ్మలమడుగు	690	73	2,291	3,054
ప్రొద్దుటూరు	365	43	871	1,279
కమలాపురం	442	36	483	961
కడప	1,863	217	7,357	937
సిద్దవటం, ఒంటిమిట్ట	212	11	343	566
మొత్తం	6,216	685	18,311	25,212



నిర్మాణం పూర్తయిన ఇల్లు

దస్తగిరిని విచారించిన డీఎస్పీ

పులివెందుల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అప్రూవర్ దస్తగిరిని మల్లేలలో జరిగిన దాడి విషయమై పులివెందుల డీఎస్పీ మురళీనాయక్ విచారించారు. మంగళవారం దస్తగిరిని డీఎస్పీ తన కార్యాలయంలోకి పిలిచి మల్లేలలో జరిగిన సంఘటనపై వివరంగా అడిగి తెలుసుకున్నారు. ఆదివారం దస్తగిరి భార్య షబానాపై మల్లేలలో ఇద్దరు వైసీపీ మహిళా కార్యకర్తలు దాడికి దిగారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తొండూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ కేసు విషయమై దస్తగిరిని డీఎస్పీ విచారించారు. దాదాపు 20 నిమిషాల పాటు విచారణ సాగించారు. దాడికి పాల్పడిన ఇరువురు మహిళలకు 41నోటీసు ఇచ్చి వారిని కూడా విచారిస్తామని డీఎస్పీ ఆంధ్రజ్యోతికి వివరించారు. విచారణ పూర్తయిన అనంతరం చర్యలు తీసుకుంటామన్నారు.

మండిన ఎండలు

- పలు మండలాల్లో 41.8 డిగ్రీలు

కడప కలెక్టరేట్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎండలు రోజురోజుకూ మండిపోతున్నాయి. మంగళవారం నాలుగు మండలాల్లో మరీ ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా ఖాజీపేట మండలంలో 41.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు, వేంపల్లిలో 41.7, తొండూరులో 41.3, సింహాద్రిపురంలో 41.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అట్లూరు, వేంపల్లి, వీఎన్‌పల్లి మండలాల్లో 40.7 డిగ్రీల చొప్పున, పోరుమామిళ్లలో 40.6, కడపలో 40.2, కొండాపురంలో 40., లింగాలలో 40.2, పెండ్లిమర్రిల్లో 40.2, ఒంటిమిట్టలో 40.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మిగిలిన మండలాల్లో సైతం 37 డిగ్రీల నుంచి 39.8 డిగ్రీల వరకు ఎండలు కాశాయి. ఉక్కపోతతో పాటు వడగాల్పులు వీచినట్లు ఏపీ విపత్తుల శాఖ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది.

మద్దతు ధరతో మినుములు, శెనగల కొనుగోలు

కడప కలెక్టరేట్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పండించిన శెనగలు, మినుములను రైతుల నుంచి మద్దతు ధరతో రాష్ట్ర ప్రభుత్వం ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తుందని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనగలు క్వింటాల్ రూ.5,650, మినుములు క్వింటాల్ రూ.7400 మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని పేర్కొన్నారు. శనగలు, మినుములు పండించి ఈ-క్రాప్ నమోదు చేయించుకున్న రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు ఇంకా ఎవరైనా తమ పేర్లు నమోదు చేయించుకోకుండా ఉంటే రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని జేసీ సూచించారు.

మట్టి పెల్లలు పడి.. కార్మికుడు మృతి

- అక్రమంగా ముగ్గురాయి వెలికితీత

కడప/వేంపల్లె, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె మండలం కత్తలూరు సమీపం లోని చెరువు వద్ద అక్రమంగా నిర్వహి స్తున్న ముగ్గురాయి గనిలో మట్టిపెల్లలు విరిగిపడ్డంతో కార్మికుడు మృతిచెందాడు. బాధితుల కథనం మేరకు.. వేంపల్లె మండలం కత్తలూరులో లింగాల మండ లం కర్ణపాపాయపల్లెకు చెందిన అధికార పార్టీ నాయకుడు అక్రమ మైనింగ్ చేస్తు న్నాడు. అక్కడకు చుట్టుపక్కల గ్రామాల్లో ని కూలీలు వచ్చి పనులు చేస్తున్నారు. సుమారు 50 అడుగుల లోతు ఉన్న మైన్‌లో మంగళవారం కూలీలు పనికి వెళ్లారు. ఉదయం 11గంటల ప్రాంతంలో లోపలున్న కూలీలమీద పైనుంచి మట్టిపెల్లలు విరిగిపడ్డాయి. దీంతో వేముల మండలం అమ్మయ్యగారిపల్లెకు చెందిన చిట్టిబో యిన రామచంద్ర (55) అనే కూలీ మృతిచెందాడు. మరో ముగ్గురు ప్రాణాలతో బయటపడ్డారు. ఈ విషయం మొద ట్లో గోప్యంగా ఉంచారు. ఆనోటా ఈనోటా బయటకు పొక్క డంతో పోలీసులకు, మీడియా కు సమాచారం అందింది. సీఐ సురేశ్‌రెడ్డి పోలీసు సిబ్బంది, వేముల పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. అప్పటికే సహచర కూలీలు కూరుకుపోయిన రామచంద్రను బయట కు తీసే ప్రయత్నం చేస్తున్నారు. చివరకు మట్టిని తవ్విచూడ గా రామచంద్ర చనిపోయాడు. దీనిపై మృతుడి కుమారుడు రాజశేఖర్ ఫిర్యాదు చేశారు. సీఐ సురేశ్‌రెడ్డి, ఎస్ఐ రంగారా వు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా కుటుంబ సభ్యులకు పరిహారం ఇచ్చేలా పెద్ద మనుషులు ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది.



గనిలో నుంచి రామచంద్రను బయటకు తీసేందుకు ప్రయత్నిస్తున్న కూలీలు



చిట్టిబోయిన రామచంద్ర (ఫైల్‌ఫొటో)

మద్యం ప్రీమియం స్టోర్‌కు దరఖాస్తుల ఆహ్వానం



కడప క్రైం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతన ఎక్సైజ్ విధానంలో భాగంగా కడప మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రీమియం మద్యం స్టోర్ ఏర్పాటు చేయడానికి ఆమోదం తెలిపింది. దీనికోసం ప్రభుత్వం ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసిందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ తెలిపారు. ఈ ప్రీమియం స్టోర్‌కు ఈ నెల 26తేదీ లోపు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రీమియం స్టోర్ లైసెన్సు వ్యవధి ఐదు సంవత్సరాలని అన్నారు. ఏపీఎస్‌బీసీఎల్.ఏపీ.జీవోవీ.ఇన్‌లో అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు రుసుం రూ.15లక్షలని ఆఫ్‌లైన్ విధానంలో 26వతేదీ సాయంత్రం 5గంటలకల్లా సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు కడప స్టేషన్ హౌస్ ఆఫీసర్ 9440902592 నెంబరును సంప్రదించాలన్నారు.

కోదండ రామాలయానికి పర్యాటక శోభ

- ఒంటిమిట్ట కేంద్రంగా టూరిజం హబ్ ఏర్పాటు
- మండలిలో మంత్రి కందుల దుర్గేశ్ వెల్లడి

ఒంటిమిట్ట కోదండరామాలయం



రాజంపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర భద్రాద్రిగా గుర్తింపు పొందిన ఒంటిమిట్ట కోదండరామాలయాన్ని ఆధ్యాత్మిక కేంద్రంతో పాటు దేశంలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. శాసనమండలిలో మంగళవారం రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ మాట్లాడుతూ ఒంటిమిట్ట ఆధ్యాత్మిక కేంద్రంగా చుట్టూ ఉన్న ఆలయాలను కలిపి టూరిజం హబ్‌గా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఒంటిమిట్ట కేంద్రంగా రాయలసీమలోని ప్రధాన ఆలయాలైన దేవుని కడప, పుష్పగిరి, బ్రహ్మంగారిమఠం, గండిక్షేత్రం, యాగంటి, నందవరం, మహానంది తదితర ప్రధాన ఆలయాలన్నింటిని కలుపుతూ టూరిజం హబ్‌గా అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించారు. ఒంటిమిట్ట ప్రధాన ఆలయానికి ఆనుకుని ఉన్న ఒంటిమిట్ట చెరువులో శ్రీరామ ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధరించి నీటిని నింపి ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసేటట్లు ట్యాంక్‌బండ్ రీతిలో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయనున్నారు. ఒంటిమిట్టలో ఉన్న హరిత రెస్టారెంట్‌ను ఆధునీకరించి మరికొన్ని ఏర్పాట్లు చేయనున్నారు. ప్రస్తుతం ఒంటిమిట్ట కోదండరామాలయం టీటీడీ ఆధీనంలో నడుస్తోంది. టీటీడీ నిధులతోనే అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. అయితే రాష్ట్ర పర్యాటక మంత్రి ప్రకటన ప్రకారం కేంద్ర పర్యాటకశాఖ మంత్రి గజేంద్ర షెకావత్ ఆధ్వర్యంలో కేంద్ర నిధులను విడుదల చేయించి ఆ నిధులతో రాష్ట్ర ప్రభుత్వం నిధులను జోడించి ఒంటిమిట్టలో అనేక పర్యాటక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నారు. కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల పర్యాటకులు ఒంటిమిట్టకు వచ్చినప్పుడు ఈ ఆలయ ప్రాధాన్యతను, చుట్టుపక్కల ఆలయాల ప్రత్యేకతను తెలుగుతో పాటు ఇంగ్లీషు, తమిళం, హిందీ తదితర భాషల్లో పర్యాటకులకు తెలియజేయడానికి అందుకు సంబంధించిన గైడ్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఏప్రిల్‌లో కోదండరాముడి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా కల్యాణోత్సవానికి సీఎం చంద్రబాబు ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఈ సమయంలో దీనిపై స్పష్టమైన ప్రకటన వెలువడనుంది. అనంతరం ఒంటిమిట్ట చుట్టుపక్కల ప్రధాన ఆలయాలను ఆధ్యాత్మిక కేంద్రాలతో పాటు పర్యాటక కేంద్రాల హబ్‌గా అభివృద్ధి పనులు చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టనున్నట్లు తెలుస్తోంది.

అంతులేని అవినీతి



- జగనన్న ఇళ్ల నిర్మాణంలో.. రూ.27 లక్షలు స్వాహా
- ఆరోపిస్తున్న కాంట్రాక్టర్
- విచారణ కమిటీ వేసిన మున్సిపల్ కమిషనర్
- నెల దాటినా ముగియని విచారణ

ప్రొద్దుటూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రొద్దుటూరు జగనన్న ఇళ్ల నిర్మాణంలో అంతులేని అవినీతి సాగింది. ఒక్కో బాధితుడు బయటికి వస్తుండటంతో ఈ అవినీతి లోతు పాతులు తేటతెల్లమౌతున్నాయి. ముఖ్యంగా హౌసింగ్ డిపార్ట్‌మెంటులో వర్కు ఇన్‌స్పెక్టర్ల దగ్గరి నుంచి ఏఈలు డీఈలు, వార్డు సచివాలయ అమినిటీస్ సెక్రటరీలు ఇందులో కీలకపాత్ర పోషించారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాలను మూడు ఆప్షన్ల కింద నిర్మించుకోవచ్చని నిర్ణయించారు. ఇందులో ఆప్షన్ 1, 2 కింద లబ్ధిదారుడు నేరుగా ఇంటిని నిర్మించుకుంటే దశల వారీగా సచివాలయ అమినిటీస్ సెక్రటరీలు ఎంబుక్ రికార్డు చేసి జియోటాగ్ అయ్యాక బిల్లులు హౌసింగ్ డిపార్టుమెంటుకు పంపుతారు. హౌసింగ్ డిపార్టుమెంటులో ఏఈ, డీఈ, ఈఈ, పీడీ వరకు అధికారులు పరిశీలించి బిల్లులు మంజూరు చేస్తారు. ఈ విధానంతో లబ్ధిదారుని ఖాతాలో నేరుగా దశల వారీగా నిర్మాణం పూర్తయిన మేరకు బిల్లుల డబ్బులు పడతాయి. లబ్ధిదారుడే డబ్బులు తీసుకుని ఇంటి నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టరుకు చెల్లించాలి. కానీ అమినిటీస్ సెక్రటరీలు లబ్ధిదారుల నుంచి డబ్బులు తీసుకుని కాంట్రాక్టరుకు చెల్లించకుండా స్థలాల వ్యాపారాల్లో, ఆన్‌లైన్ జూదాల్లో పెట్టారని ప్రచారం ఉంది.

కాంట్రాక్టర్ ఫిర్యాదుతో..

ప్రొద్దుటూరు మున్సిపాలిటీ 1వ సచివాలయం పరిధిలోని బొల్లవరం లేఅవుట్‌లో ఏ-జి బ్లాక్‌లలో ఎర్రమాసు శ్రీను అనే కాంట్రాక్టర్ ఆప్షన్-2 కింద మొదటగా 121 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. దశలవారీగా ఆ 121 ఇళ్లకు లబ్ధిదారుల వ్యక్తిగత ఖాతాల్లో హౌసింగ్ అధికారులు డబ్బులు జమ చేశారు. తదుపరి కొన్ని గృహాలను ఆప్షన్-3 కిందకు మార్చడంతో కాంట్రాక్టర్ ఖాతాలో డబ్బులు జమచేశారు. ఇందులో 121 గృహాలకు రూ.71,85,732 జనరేట్ చేశారు. అందులో రూ.44,67,579 మాత్రమే సచివాలయ తన ఖాతాలో జమచేశారని మిగతా రూ.27,18,153 అమినిటీస్ సెక్రటరీ స్వరూప్‌కుమార్ స్వాహా చేశాడని కాంట్రాక్టర్ ఎర్రమాసు శ్రీను ఆరోపిస్తున్నారు. అలాగే 121 ఇళ్ల నిర్మాణాలకు 3,695 సిమెంటు బస్తాలు సచివాలయ అమినిటీస్ సెక్రటరీ స్వరూప్ కుమార్ జనరేట్ చేశారు. కానీ 1,830 బస్తాలు మాత్రమే ఇచ్చారని హౌసింగ్ గోడౌన్ రిజిష్టర్‌లో తన సంతకాలు లేవని కాంట్రాక్టర్ ఆరోపిస్తున్నారు. 35,556 కేజీల స్టీలు కడ్డీలకు సచివాలయ సెక్రటరీ ఎస్ఆర్‌వోలు జనరేట్ చేయగా 20,606 కేజీలు మాత్రమే కాంట్రాక్టర్ గోడౌన్‌లో తీసుకున్నట్లు రిజిష్టర్ బుక్‌లో ఉందన్నారు. ఇందులో గోడౌన్‌లో తన పేర జనరేట్ అయిన 1,825 సిమెంటు బస్తాలు, 14,606 కేజీల స్టీలు ఎవ్వరు స్వాహా చేశారో విచారించి చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్ గత ఏడాది డిసెంబర్‌లో కలెక్టర్‌కు పీజీఆర్ఎస్ కింద ఫిర్యాదు చేశారు. దీనిపై హౌసింగ్ డీఈ గురుప్రసాద్ విచారణ చేపట్టారు. ఆ విచారణ నివేదికలో కాంట్రాక్టరుకు డబ్బులు ఇచ్చినట్లు అమినిటీస్ సెక్రటరీ రిజిష్టర్‌లో సంతకాలు, తేదీలు పొంతన లేవని.. కొన్ని తేదీల కొట్టివేత, అమౌంట్ కొట్టివేతలు ఉన్నాయంటూ పొందుపరిచారు. అలాగే గోడౌన్‌లో స్టీలు, సిమెంటు తీసుకోవడంపై హౌసింగ్ అసిస్టెంట్ ఇంజనీర్ (ప్రొద్దుటూరు అర్బన్) గోడౌన్ రిజిస్టర్‌ను పరిశీలించి ఫైనల్ రిపోర్టు ఇవ్వాలని కోరారు. ఆ రిపోర్టు వచ్చాక పరిశీలిస్తామని పీజీఆర్ఎస్ నివేదికలో డీఈ జనవరి 20న వెల్లడించారు. కానీ నేటికి గోడౌన్ ఏఈ రిజిస్టర్లను పరిశీలించి రిపోర్టు ఇచ్చిన దాఖలాలు లేవు. అలాగే కాంట్రాక్టరుకు సచివాలయ సెక్రటరీ స్వరూప్ డబ్బులు అంతా ఇచ్చానని ఆ మేరకు తాను నమోదు చేసిన నివేదికలు పరిశీలించుకోవచ్చని వెల్లడిస్తున్నారు.



ఫిబ్రవరి 6న విచారణ కమిటీ వేసిన కమిషనర్

అమినిటీస్ సెక్రటరీ స్వరూప్ కుమార్ నుంచి తనకు రావాల్సిన డబ్బులపై తేల్చాలని ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్‌కు కాంట్రాక్టర్ ఎర్రమాసు శ్రీను ఫిర్యాదు చేశారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ఈ 121 ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి జరిగిన పనులు అయిన బిల్లులు వాటి చెల్లింపులు హౌసింగ్ గోడౌన్‌లో ఇచ్చిన స్టీలు సిమెంటు వాటన్నింటిపై సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఐదుగురితో కూడిన కమిటీని ఫిబ్రవరి 6వతేదీన నియామకం చేశారు. ఈ విచారణ కమిటీలో మున్సిపల్ ఏఈ డి.మణిగోపాల్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ బి.రవికుమార్, మెప్మా సీవో కె.రామయ్య, హౌసింగ్ వర్కు ఇన్‌స్పెక్టర్ వై.రామాంజనేయులు, ఆప్కాస్ ఫీల్డ్ అసిస్టెంట్ వెంకట వివేకానంద ఉన్నారు. ఈ విచారణ కమిటీ మూడు రోజుల లోపల నివేదిక ఇవ్వాలని అందులో కమిషనర్ పేర్కొన్నారు. నెల దాటినా గోడౌన్ ఇన్‌చార్జ్ సిమెంటు స్టీలుకు సంబంధించిన నివేదిక ఇవ్వలేదని సమాచారం. అంతేకాకుండా ఈ కమిటీ సైతం విచారణ పూర్తి చేసి నివేదిక ఇవ్వకుండా కాలయాపన చేస్తోంది.

ఎవరి పాత్ర ఉన్నా వదలం

జగనన్న ఇళ్ల నిర్మాణంలో జరిగిన అవినీతిపై వచ్చిన ఆరోపణల మేరకు కలెక్టర్ ఆదేశాలతో హౌసింగ్ డిపార్ట్ మెంటు విచారణ చేసి ఎటూ తేల్చలేదు. దీంతో మేము విచారణ కమిటీ వేశాం. ఇంకా విచారణ పూర్తి కాలేదు. మూడు రోజుల్లో విచారణ పూర్తి చేసి నివేదిక తెప్పించుకుని అందులో ఎవరెవ్వరి పాత్ర ఉందో వారిపై చర్యలు తీసుకుంటాం. అవసరమైతే సస్పెన్షన్ చేస్తాం.

- మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్ ప్రొద్దుటూరు

జడ్పీ చైర్మన్ ఎన్నికకు గ్రీన్ సిగ్నల్

- 23న నోటిఫికేషన్.. 27న ఎన్నిక

కడప రూరల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఖాళీగా ఉన్న జడ్పీ చైర్మన్ స్థానాలతో పాటు మండల అధ్యక్షులు, ఉపాధ్యక్షుల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం మంగళవారం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాలో ఖాళీగా ఉన్న జడ్పీ చైర్మన్ ఎన్నికతో పాటు ఖాజీపేట, ఒంటిమిట్ట, రాయచోటి మండలాల వైస్ ఎంపీపీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. జడ్పీ చైర్మన్ ఎన్నికకు 23న నోటిఫికేషన్ జారీచేసి 27న ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీచేసింది. అదేరోజు ఎన్నికలు పూర్తయిన వెంటనే ఫలితాలను వెల్లడిస్తారు. ఇప్పటికే వైసీపీ తమ అభ్యర్థిగా బి.మఠం జడ్పీటీసీ సభ్యుడు రామగోవిందరెడ్డిని ప్రకటించింది. 50 మంది జడ్పీటీసీలలో దాదాపు 42 మంది వైసీపీ వారే. దీంతో 27న జరిగే ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి గెలుపు సునాయసం కానుంది. కాగా ప్రస్తుతం ప్రొద్దుటూరు జడ్పీటీసీ సభ్యురాలు జె.శారద జడ్పీ ఇన్‌చార్జ్ చైర్‌పర్సన్‌గా ఉన్నారు.

'అతుకుబడి'తో తంటా..!

అతుకుబడి పట్టా... ఈ పేరు దాదాపు ఎవరూ విని ఉండరు. రైతుల పట్టాదారు పాస్‌పుస్తకాల్లో అతుకుబడి అనే పేరు జిల్లాలోని రైల్వేకోడూరు నియోజకవర్గంలో కొత్తగా వినిపించింది. ఎలా జరిగిందో తెలియదు గాని రైతు పాస్‌పుస్తకాలను ఆన్‌లైన్ చేసే క్రమం లో రైల్వేకోడూరు రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న ఓ కంప్యూటర్ ఆపరేటర్ 2012లో అతుకుబడి అనే పేరును నమోదు చేసి రైతు పట్టాదారు పాసుపుస్తకాల్లో ముద్రించారు.

- రిజిస్ట్రేషన్‌కు నోచుకోని భూములు
- రైల్వేకోడూరులోనే 17 వేల పట్టాలు
- జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో ముమ్మరంగా కసరత్తు
- సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు

రైల్వేకోడూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రాగానే భూముల సర్వేపై రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త నిబంధలనతో ఈ అంశం తెరపైకి వచ్చింది. దీంతో రెవెన్యూ అధికారులు అతుకుబడి భూముల పై ప్రక్రియ ప్రారంభించారు. అతుకుబడి అని పట్టాదారు పాసు పుస్తకాలలో ఉంటే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు కాకపోవడంతో పలువురు రైతులు ఇబ్బందులు పడ్డారు. రైతు పట్టాదారు పాస్‌పుస్తకాల్లో జిరాయితీ అని ఉంటేనే రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. అతుకుబడి ఉంటే చేయడం లేదని ఇటు ప్రభుత్వానికి, అటు అధికారులకు రైతులు వినతులు ఇవ్వడం


రైల్వేకోడూరు రెవెన్యూ కార్యాలయంలో ఫ్రీహోల్డ్‌పై నివేదికలు తయారు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

తో ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. అతుకుబడి అని ఉంటే భూమి ఆన్‌లైన్ కరెక్షన్స్ కూడా చేయలేని పరిస్థితి ఏర్పడింది. గతంలో రైతుల పట్టాదారు పాస్ పుస్తకాల్లో అతుకుబడి, జిరాయితీ అనే పేర్లు లేవు. సాధారణంగా రైతు పాసు పుస్తకాల్లో భూమి సర్వే నెంబర్లు, విస్తీర్ణం, డీకేటీ అయితే డీకేటీ, పట్టా అయితే పట్టా ఇలా ఉండేవి. మళ్లీ పట్టాదారు పాస్ పుస్తకాల్లో రాజముద్రలు, స్టిక్కర్లు తదితరాల్లో రెవెన్యూ శాఖ మార్పులు తీసుకొచ్చింది. ఇవి ఉంటేనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో క్రయవిక్రయాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు జరిగేవి. ప్రస్తుతం రైతు పట్టాదారు పాసుపుస్తకాల్లో అతుకుబడి, జిరాయితీ అనే పదాలు కొత్తగా వినిపిస్తున్నాయి. ఇవి ప్రత్యేకించి రైల్వేకోడూరు నియోజకవర్గం లోనే ఉండటం విశేషం. దీంతో ఇటు అధికారులు, రైతులు తలలు పట్టుకున్నారు. రెవెన్యూ సదస్సుల్లో అత్యధికంగా అతు కుబడి పట్టాలు ఉన్న రైతులు తమకు విముక్తి కల్గించాలని విన్నపాలు చేసుకున్నారు. రెవెన్యూశాఖ దీనిపై ప్రభుత్వానికి నివేదిక పంపింది. దీంతో ప్రభుత్వం వెంటనే చర్యలు ప్రారంభించింది. రిజిస్ట్రేషన్లు కాకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడింది. జిల్లాలో ఎక్కడా లేనిది ఒక్క రైల్వేకోడూరు నియోజకవర్గంలోనే అతుకుబడి పట్టాలు ఉన్నాయని అధికారులు గుర్తించారు. దీనిని జిరాయితీగా ఎలా మార్చాలని



ఆన్‌లైన్‌లో కనిపిస్తున్న అతుకుబడి పట్టా

ప్రభుత్వం అధికారులతో చర్చించింది. సాధ్యాసాధ్యాలను జాయింట్ కలెక్టర్ పరిశీలించి రైల్వేకోడూరు తహసీల్దార్‌కు నివేదిక త్వరితగతిన ఇవ్వాలని ఆదేశించడంతో అతుకుబడి పట్టాల నివేదికలు కలెక్టర్ కార్యాలయానికి పంపారు. అతుకుబడి లేకుండా జిరాయితీ అనే పదంతో క్రయవిక్రయాలు జరిగే విధంగా జాయింట్ కలెక్టర్ ప్రత్యేకంగా చర్యలు తీసుకున్నారు. దీంతో త్వరలో రైతులకు తీపి కబురు రానుంది.

అతుకుబడి పట్టాలకు త్వరలోనే మోక్షం



అతుకుబడి పట్టాలకు త్వరలోనే మోక్షం లభిస్తుంది. భూముల క్రయవిక్రయాలు జరిగేందుకు వీలుగా తీసుకునే చర్యల్లో భాగంగా ఫ్రీహోల్డ్ భూములను గుర్తిస్తోంది. జిల్లా అధికారులు దీనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. దీంతో మేం కూడా ఫ్రీహోల్డ్ భూములపై నివేదికలు తయారు పంపాం.

\- మహబూబ్ చాంద్, తహసీల్దార్, రైల్వేకోడూరు


రీసర్వేపై రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

రీసర్వే పక్కాగా చేయండి

● అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్

గుర్రంకొండ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): భూముల రీ సర్వే పక్కాగా చేయాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ రెవెన్యూ సిబ్బందికి సూచించారు. గుర్రంకొండ తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో ఆయన మాట్లాడుతూ మండలంలో ఎన్ని వేల ఎకరాల భూములున్నాయి. అందులో డ్రై ల్యాండ్ ఎంత...? వెట్ ల్యాండ్ ఎంత? ఎన్ని గ్రామాల్లో రీ సర్వే చేస్తున్నారు, ఇప్పటి వరకు ఎన్ని ఎకరాల్లో సర్వే చేశారని తహసీల్దార్‌ని అడిగి వివరాలు సేకరించారు. మండలంలో 3,356 ఎకరాల్లో సర్వే చేయాల్సి ఉండగా, మూడు టీములు ఏర్పాటు చేసి రోజుకు 60 ఎకరాలు సర్వే చేసేలా ప్రణాళిక రూపొందించామని అధికారులు తెలిపారు. ప్రగతి సాధనలో వెనుకబడి ఉండడంతో సిబ్బందిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విధులను సక్రమంగా నిర్వహించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పీజీఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంపై ఆరా తీశారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసులు, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

కోదండ రామాలయంలో దేవదాయశాఖ ఏసీ పరిశీలన

నందలూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆరవపల్లెలో ఉన్న కోదండరామాలయ పునర్నిర్మాణ పనులను మంగళవారం దేవదాయశాఖ అన్నమయ్య జిల్లా అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్ పరిశీలించారు. ధూప, దీప, నైవేద్యం పథకం కింద అర్చకుడి నియామకానికి అనుకూలమైన పరిస్థితులపై ఆరా తీశారు. ధర్మకర్త గంపా సుధాకర్, నడివీధి సుధాకర్, ఆకుల చలపతి, నారపుశెట్టి వేణుగోపాల్, శివకుమార్‌పాల్గొన్నారు.

కారు, బస్సు ఢీకొని ఒకరి మృతి



సంఘటన స్థలంలో గుమిగూడిన జనం (ఇన్‌సర్ట్) జహీర్ మృతదేహం

కురబలకోట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కారును బస్సు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నా యి. కడప పట్టణానికి చెందిన జహీర్(27) రెడీమేడ్ దుస్తుల దుకాణాన్ని నిర్వహిస్తుంటాడు. మం గళవారం ఉదయం తన తమ్ముడు షామీర్‌తో కలిసి కారులో బెంగ ళూరులో దుస్తులు కొనడానికి బయలుదేరాడు. కురబలకోట మండ లం మధ్యాహ్నంవారిపల్లె సమీపంలో వారి కారు, బస్సును ఢీకొంది.. ఈ ప్రమాదంలో జహీర్ అక్కడిక్కడే మృతి చెందాడు. గాయపడిన షామీర్‌ను 108 వాహనంలో మదనపల్లెలోని ప్రభుత్వాసుపత్రికి తర లించారు. ప్రమాదం కారణంగా రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముదివేడు పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య


చంద్రశేఖర్ రెడ్డి (ఫైల్‌ఫొటో)

సిద్దవటం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యం లో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు మండలంలోని తురకపల్లెకు చెందిన చంద్రశేఖర్ రెడ్డి (36) ఏడేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన సబీనా అనే మహిళను వివాహం చేసుకున్నాడు. కడపలో కూలి పనులు చేసేవాడు. అతను ఇంట్లోని పైకప్పునకు చీరతో ఉరి వేసుకున్నట్లు మంగళవారం ఉదయం 6 గంటలకు భార్య గుర్తించింది. మరో ఇద్దరు మహిళల సాయంతో అతనిని కిందికి దింపి చూడగా అప్పటికే మృతిచెందాడని ఆమె తెలిపింది. అప్పుల బాధ తాళలేక ఉరి వేసుకుని ఉంటాడని ఆమె పోలీసులకు తెలియజేసింది. మృతుడి తల్లి మల్లీశ్వరి మాట్లాడుతూ తన భార్య నీచంగా మాట్లాడుతూ వేధిస్తోందని, తనను చంపేస్తారంటూ ఫోన్ చేశాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

మారుతి వ్యాన్ బోల్తా.. ముగ్గురికి గాయాలు

గుర్రంకొండ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి మారుతి వ్యాన్ బోల్తాపడిన సంఘటన మంగళవారం సూరప్పగారిపల్లె సమీపంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు కర్ణాటక రాష్ట్రం చింతామణికి చెందిన నంజుండప్ప, ప్రకాశ్, హేమావతి అన్నమయ్య జిల్లా రాయచోటిలోని వీరభద్రస్వామిని దర్శించుకోవడానికి మారుతి వ్యాన్‌లో బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న వ్యాన్ గుర్రంకొండ మండలం చెర్లోపల్లె పంచాయతీ సూరప్పగారిపల్లె సమీపంలోని నయారా పెట్రోల్ బంకు వద్ద అడ్డుగా వచ్చిన ద్విచక్ర వాహనాన్ని తప్పించే యత్నంలో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మారుతి వ్యాన్‌లో ఉన్న నంజుండప్ప(45), ప్రకాశ్(35), హేమవతి(30)కి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో వాల్మీకిపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ మధు రామచంద్రుడు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో 11 మందికి..


మదనపల్లె ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

మదనపల్లె అర్బన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): దైవ దర్శనానికి వచ్చిన 11 మంది రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు.మదన పల్లెలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి అవుట్ పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు కర్ణాటక రాష్ట్రం దేవనహళ్లికి చెందిన వారు రాయచోటిలోని వీరభద్ర స్వామి దర్శనానికి బైక్‌లో బయలుదేరారు. గుర్రంకొండ మండలం, చెర్లోపల్లె సమీపంలోని పెట్రోల్ బంకులో బైక్‌లో పెట్రోల్ పోయించుకుని వేగంగా రోడ్డుపైకి వచ్చారు. అదే సమయంలో గుర్నంకొండ నుంచి వస్తున్న ఒమ్నీ వాహనం ఆ బైక్‌ను తప్పించబోయి అదుపుతప్పి బోల్తా పడింది. ఆ వాహనంలో ఉన్న 11మంది గాయాలు అయ్యాయి. స్థానికులు వారిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. గుర్రంకొండ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎనిమిది మందిపై అట్రాసిటీ కేసు

మదనపల్లె అర్బన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లరాజుగారిపల్లెకు చెందిన ఎనిమిది మందిపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు మదనపల్లె తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. మదనపనల్లె మండలం, నల్లరాజుగారిపల్లెకు చెందిన ముని వెంకటరమణ(69)తన పొలంలో ఇల్లు నిర్మించుకుంటుండగా గత నెల 17వ తేదీన అదే గ్రామానికి చెందిన బాలకృష్ణనాయుడు, కళావతి, రవినాయుడు, నారాయణ, ఆదెమ్మ, శ్రీనివాసులు నాయుడు, సోముశేఖర్‌నాయుడు, సంజు పనులు అడ్డుకుని దాడి చేశారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేసి ఎస్టీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

జలవనరుల శాఖ డీఈఈలకు పదోన్నతులు

కలికిరి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కడప, అన్నమయ్య జిల్లాల్లో జలవనరుల శాఖలో వివిధ విభాగాల్లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా పనిచేస్తున్న 16 మందికి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పదోన్నతులు పొందిన వారిలో కడప ఇరిగేషన్ సర్కిల్‌లో అన్నమయ్య డివిజన్ నారమరాజుపల్లె సబ్ డివిజన్-3 డీఈఈగా పనిచేస్తున్న ఎల్.జయచంద్రా రెడ్డి, విజయవాడ హైడ్రాలజీ (ఇన్వెస్టిగేషన్) విభాగంలో కడప ఆర్వోక్యూఎల్-2 డీఈఈగా వున్న ఎం.పి.విజయకుమార్, కడప కన్‌స్ట్రక్షన్ సర్కిల్-3 విభాగంలో పులివెందులలో జీఎన్ఎస్ఎస్ సబ్ డివిజన్-12లో డీఈఈగా పని చేస్తున్న ఎల్.గోపాల్ రెడ్డి, తిరుపతి తెలుగు గంగ, జీఎన్ఎస్ఎస్ సర్కిల్ పరిధిలోని రేణిగుంట డివిజన్‌కు సంబంధించి కోడూరు సబ్ డివిజన్ డీఈఈ ఎస్.రవిశంకర్ రెడ్డి, కడప జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీరు (ప్రాజెక్టులు) కార్యాలయ డీఈఈ ఎం.జనార్దన్, హంద్రీ నీవా సుజల స్రవంతి మదనపల్లె సర్కిల్-3 పరిధిలోని ఎమ్మిగనూరు సబ్ డివిజన్ డీఈఈ ఎస్.మురళి, ఇదే సర్కిల్-3 కదిరి సబ్ డివిజన్-1లో ఎస్.సురేంద్రనాథ రెడ్డి, తిరుపతి తెలుగ గంగ ప్రాజెక్టు సర్కిల్ పరిధిలోని మదనపల్లె టీజీపీ క్వాలిటీ కంట్రోల్ విభాగంలో డి.శ్రీనివాస రెడ్డి ఉన్నారు. ఇంకా ఎస్‌కేడీ జీఎన్ఎస్ఎస్ కడప సర్కిల్‌కు చెందిన కడప మామిళ్లపల్లె సబ్ డివిజన్-2 డీఈఈ ఎస్.రావి రెడ్డి, కోస్టల్ రీజియన్ ఈపీఈఆర్ఎల్ కడప డివిజన్ డీఈఈ ఎస్.రవిచంద్రన్, ఎన్టీఆర్ టీజీపీ కడప సర్కిల్ పోరుమామిళ్ల డీఈఈ ఎస్.ఉమామహేశ్వర రావు, ఎస్‌కేడీ జీఎన్ఎస్ఎస్ కడప సర్కిల్, మామిళ్లపల్లె సబ్ డివిజన్-1 డీఈఈ వి.వెంకటేశ్వర్లు, ఎన్టీఆర్ టీజీపీ పోరుమామిళ్ల సబ్ డివిజన్-4 డీఈఈ పి.కృష్ణారెడ్డి, జీఎన్ ఎస్ఎస్ కడప సర్కిల్ ఎర్రగుంట్ల సబ్ డివిజన్-4 డీఈఈ ఇ.జయరాము, ఎన్టీఆర్ టీజీపీ పులివెందుల సబ్ డివిజన్-3 డీఈఈ ఎస్.ఈశ్వరయ్య, జీఎస్ఎస్ఎస్ పులివెందుల డివిజన్ కొండాపురం సబ్ డివిజన్-4 డీఈఈ పోతిరెడ్డి ప్రసూనాదేవి ఉన్నారు. వారందరూ పదిహేను రోజుల్లోగా ఆయా విధుల్లో చేరాలం టూ రాష్ట్ర జలవనరుల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పక్కా గృహాల నిర్మాణాలు పూర్తి చేయాలి

● హౌసింగ్ పీడీ శివయ్య

లక్కిరెడ్డిపల్లె, మార్చి 18(ఆంధ్రజ్యోతి):అర్ధాంతరంగా ఆగిపోయిన పక్కా గృహాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ శివయ్య సూచించారు. మంగళవారం మండలంలోని అనంతపురం, హరిజనవాడ, వడ్డెపల్లె, చౌటపల్లెల్లో అసంపూర్తిగా ఉన్న పక్కా గృహాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడుతూ ఆర్థిక స్థోమత లేక ఇల్లు నిర్మించుకోలేని ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు ప్రభుత్వం అదనంగా రూ.50 వేలు, ఎస్టీలకు రూ. 75 వేలు ఇస్తోందన్నారు. పనులు మొ దలు పెట్టిన వెంటనే బిల్లులు ఇస్తామన్నారు. పలువురు లబ్ధిదారులు ప్రభుత్వం ఇస్తున్న అదనపు బిల్లుకు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. అసంపూర్తిగా ఉన్న పక్కా ఇళ్ల నిర్మాణాల పూర్తికి రాష్ట్ర ప్రభుత్వం 350 కోట్ల రూపాయలు మంజూరు చేసిందన్నారు. పక్కాగృహాలు లేని అర్హులైన నిరుపేదలు 2025-26కు సంబంధించిన పక్కాగృహాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. గ్రామ సచివాలయాలు, మండల హౌసింగ్ కార్యాలయంలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఈ ఏడాది మంజూరు చేసే ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం 4,30 లక్షల రూపాయలు ఇస్తుందన్నారు. దరఖాస్తుదారులు ఎస్సీ, ఎస్టీ, బీసీలు తప్పకుండా కులం, ఆదాయం ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. హౌసింగ్ ఏఈలు జనార్దన్,అంజి పాల్గొన్నారు.


లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ శివయ్య

పొసెషన్ సర్టిఫికెట్ తప్పనిసరి


పెద్దతిప్పసముద్రం మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మంజూరు చేసే గృహనిర్మాణాలకు పొసెషన్ సర్టిఫికెట్ తప్పని సరి అని హౌసింగ్ డీఈ వెంకటరెడ్డి వెల్లడించారు. మంగళవారం ఆయన హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్‌తో కలిసి మండలంలోని వివిధ గ్రామాల్లో గృహ నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం స్థానికులతో మాట్లాడుతూ సొంత స్థలం కలిగి ఉన్న వారికి గృహాలు మంజూరు చేస్తామన్నారు. అలాంటి వారు రెవెన్యూ అధికారుల నుంచి పొసెషన్ సర్టిఫికెట్ తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగింపు

● జూనియర్ ఇంటర్ అర్హత పరీక్ష తేదీలో మార్పు

కలికిరి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మహాత్మ జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు పంపుకోవడానికి గడువు పొడిగించినట్లు జిల్లా కన్వీనరు వై.సోమశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తులు పంపుకోవడానికి గతంలో మార్చి 15వ తేదీ చివరి తేదీగా ప్రకటించగా తాజాగా గడువు తేదీని ఈనెల 25 వరకు పొడిగించారు. బీసీ గురుకుల పాఠశాలల్లో 6, 7, 8, 9 తరగతుల్లో బ్యాక్ లాగ్ సీట్ల భర్తీ కోసం, 5వ తరగతిలో పూర్తి సీట్ల భర్తీ కోసం ఈ గడువు పొడిగించినట్లు ఆయన తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని సదుం బీసీ బాలుర జూనియర్ కళాశాలతోపాటు సదుం, కుప్పం (బాలురు), పెద్ద పంజాణి, పులిచెర్ల (బాలికలు) బీసీ గురుకుల పాఠశాలల్లోనూ, తిరుపతి జిల్లాలోని సత్యవేడు, ఐతేపల్లె (బాలురు) ఉదయమాణిక్యం (బాలికలు) తంబళ్లపల్లె (బాలురు), కలికిరి, పీలేరు (బాలికలు) పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు పంపుకోవాలన్నారు. గతంలో జూనియర్ ఇంటర్ ప్రవేశాలకు ఏప్రిల్ 20వ తేదీ ప్రవేశ పరీక్షలు జరగాల్సి ఉండగా తాజాగా దానిని మే 4వ తేదీకి మార్చినట్లు చెప్పారు. అయితే 5వ తరగతి ప్రవేశాలకు గతంలో ప్రకటించిన విధంగానే ఏప్రిల్ 27న, బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీకి అంటే 6, 7, 8, 9వ తరగతులకు ఏప్రిల్ 28న యథాప్రకారం ప్రవేశ పరీక్షలు జరపనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు పంపుకోవాలని కోరారు. ఇతర వివరాలు లేదా సందేహాల కోసం 90007 15637. 87900 92069, లేదా 79894 45396 నంబర్లలో సంప్రదించాలని కన్వీనరు సోమశేఖర్ కోరారు.

సేద తీరుస్తున్న తాటికల్లు



- వేసవి తీవ్రత నుంచి ఉపశమనం
- కార్మికుల కుటుంబాలకు ఉపాధి
- పెరిగిన డిమాండ్

రాజంపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో కల్లుకు డిమాండ్ పెరుగుతోంది. దీంతో గీత కార్మికులు కల్లు వ్యాపారంపై దృష్టి పెట్టారు. మార్చి నెల ఆరంభం నుంచి వేసవి తీవ్రత పెరుగుతూ ఉండడంతో దానికితగ్గట్లు కల్లు తీయడం ప్రారంభించారు. నందలూరు, రాజంపేట, సిద్దవటం ప్రాంతాల్లోని చెరువు గట్లు, ఊరి పొలిమేరలు, ఏటిగట్లు, పొలాల చుట్టూ, చెయ్యేరు, పెన్నానది పరివాహక ప్రాంతాల్లో వేలాదిగా తాటిచెట్లు ఉన్నాయి. ఒక్కొక్కరికీ పదుల కొద్ది తాటిచెట్లు ఉండడంతో వాటినుంచి కల్లు గీత, తాటి ముంజెల సేకరణ విక్రయం ద్వారా ఉపాధి పొందుతూ, లాభాలు గడిస్తుంటారు. ఈ సీజన్‌లో గీత కార్మికులు అధికంగా కల్లు గీయడం, గీసిన కల్లును కూడలి ప్రాంతంలో విక్రయించడంలో నిమగ్నమవుతారు. స్వచ్ఛమైన తాటికల్లు ఒక లీటరు 100 రూపాయలు చొప్పున అమ్ముకుంటారు. ఒక్కో చెట్టుకు రోజూ 3 నుంచి 5 లీటర్ల వరకు కల్లు వస్తుంది. ఇలా 5 చెట్లను గీస్తే కనీసం 15 నుంచి 20 లీటర్లు వరకు దిగుబడి వస్తుంది. దీని విక్రయం ద్వారా వచ్చే సొమ్ముతో కల్లుగీత కార్మికులు వేసవిలో కుటుంబాలను పోషించుకుంటున్నారు. ప్రస్తుతం పల్లె ప్రాంతాల్లో సుమారు 200 మంది పైబడి కార్మికులు ప్రస్తుతం ఈ పనిలో నిమగ్నమయ్యారు. చెయ్యేరు నది పరివాహక ప్రాంతాలైన నందలూరు, కుమ్మరపల్లె, ఇసుకపల్లె, నాగిరెడ్డిపల్లె, లేబాక, ఓబిలి, పొత్తపి, టంగుటూరు, నల్లతిమ్మాయపల్లె, మందరం, నారాయణ నెల్లూరు, తాళ్లపాక, మదనగోపాలపురం, గుండ్లూరు, శేషమాంబపురం, రామచంద్రాపురం తదితర ప్రాంతాల్లో తాటిచెట్లు భారీగా ఉన్నాయి. ప్రస్తుతం 10 రోజులుగా తాటిచెట్ల నుంచి విరివిగా కల్లును గీస్తున్నారు. మరో 15 రోజుల్లో తాటిముంజలు కూడ పండనున్నాయి. దీంతో రెండు రకాలుగా వీరికి లాభం చేకూరనుంది. రాను రాను తాటిచెట్లు తగ్గిపోతుండడంతో కల్లు వ్యాపారం కూడా తగ్గిపోతోంది.


కల్లు విక్రయిస్తున్న గీత కార్మికుడు

బకాయిలు చెల్లించకపోతే చర్యలు

వాల్మీకిపురం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): బకాయిలు చెల్లించనివారిపై చట్ట పర చర్యలు ఉంటాయని వాల్మీకిపురం మండలం చింతపర్తి పంచాయతీ సెక్రటరీ రెడ్డిశేఖర్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఆయన విలేకరులతో మా ట్లాడుతూ చింతపర్తి పంచాయతీలోని ప్రైవేట్ బస్టాండ్, వారపు సంతల్లో సెస్సు వసూలు హక్కులు పొందినవారు 15 ఏళ్లుగా పూర్తి స్థాయిలో డబ్బు చెల్లించలేదన్నారు. పంచాయతీ ఆదాయాన్ని సమకూర్చే లక్ష్యంతో డిపాజిట్లను వారపు సంతకు రూ.4.5లక్షలు, ప్రైవేట్ బస్టాండ్‌కు రూ.90 వేలు నిర్ణయించామన్నారు. 2025-26 సంవత్సరానికి వారపు సంత రూ.6. 15 లక్షలు, ప్రైవేట్ బస్టాండ్‌కు రూ.95 వేలకు వేలం నిర్వహించి వారి నుంచి పూర్తి డబ్బును వసూలు చేశామన్నారు ఇకముందు కూడా ఇలాగే కొనసాగుతాయని తెలియజేశారు.

చేపల చెరువుతో రూ.2.60లక్షల ఆదాయం

ములకలచెరువు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): బట్నాయని చెరువు వేలం ద్వారా రూ. 2,60,500 ఆదాయం వచ్చింది. మద్దినాయనిపల్లె పంచాయతీ కార్యాలయంలో మంగళవారం చెరువులో చేపల పెంచుకునే హక్కులకు మదనపల్లె డీఎల్‌పీఓ నాగరాజు అధ్యక్షతన వేలం నిర్వహించారు. నరసింహులు హక్కు దక్కించుకున్నారు.

సచివాలయం సర్వేయర్ సస్పెన్షన్

బి.కొత్తకోట, మార్చి 18(ఆంధ్రజ్యోతి): గుమ్మసముద్రం సచివాలయం సర్వేయర్‌గా పనిచేస్తూ ఇటీవల పీటీఎం మండలం టి.సదుం సచివాలయానికి బదిలీపై వెళ్లిన ఎస్. రాజేంద్రను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకు న్నారు. ఈ మేరకు చిత్తూరు జిల్లా భూ సర్వే అధికారి జయరాజ్ నుంచి మం గళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. గుమ్మసముద్రం సచివాలయం సర్వేయర్‌గా పని చేస్తూ తన తల్లి పేరున అక్రమంగా నాలు గు ఎకరాల భూమిని ఆన్‌లైన్ చేయించుకోవడం, అనేక అక్రమాలు చేసినట్లు ఫిర్యాదులపై ప్రాథమిక చర్యలో భాగంగా ఇతన్ని సస్పెండ్ చేసినట్లు తెలుస్తోంది. విచారణ అనంతరం తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు సమాచారం

మహిళా శిశు సంక్షేమ అధికారిగా అనూరాధ

కలికిరి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారిత అధికారి నియామకంలో స్వల్పంగా మార్పులు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పోస్టులో గుంటూరు జిల్లా ఫిరంగిపురం ఏసీడీపీవోగా పనిచేస్తున్న పి.అనూరాధను వర్క్ డెప్యుటేషన్ ప్రాతిపదికపై మహిళా శిశు సంక్షేమ సాధికారిత అధికారిగా ఈ నెల 5న నియమించినట్లు తెలిసింది. తాజాగా తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు రెగ్యులర్ అధికారిగా నియమిస్తూ ఆ శాఖ కార్యదర్శి ఎ.సూర్యకుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

ఓటరు జాబితాలో అభ్యంతరాలుంటే తెలపండి


నేతలతో మాట్లాడుతున్న ఈఆర్వో రాఘవేంద్ర

తంబళ్లపల్లె, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాలో పొరపాట్లు, మార్పులు, చేర్పులు వంటివి ఉంటే రాజకీయ పార్టీల నేతలు తెలపాలని ఈఆర్వో రాఘవేంద్ర సూచించారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఆరు మండలాల ఏఆర్వోలు, రాజకీయ పార్టీల నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాబితాపై అభ్యంతరాలుంటే వెంటనే తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు. ఎన్నికల ప్రక్రియను బలోపేతం చేసేందుకు, పరస్పర అనుకూల సలహాలు, సూచనలు అందించేందుకు రాజకీయ పార్టీలకు ఎన్నికల కమిషన్ అవకాశం ఇచ్చిందన్నారు. తప్పులు లేని ఓటర్ల జాబితాను రూపొందించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఆరు మండలాల ఏఆర్వోలు హరికుమార్, ప్రదీప్, సయ్యద్, శ్రీరాములు, అజార్, తపస్విని, సిబ్బంది కిషోర్, దినకర్, టీడీపీ, జనసేన, బీజేపీ, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

దేవదాయ భూముల్లో అక్రమ నిర్మాణాలను అడ్డుకోండి


సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌కు వినతిపత్రం ఇస్తున్న బీవైఎస్ నేతలు

మదనపల్లె టౌన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): దేవదాయ భూముల్లో అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ విన్నవించారు. మంగళవారం స్థానిక సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌ను కలిసిన బీవైఎస్ నేతలు మాట్లాడుతూ పట్టణం సహా మండలంలో పలుచోట్ల ఉన్న రూ.కోట్ల విలువైన దేవదాయ భూములను కొందరు ఆక్రమించుకుని లేఅవుట్లు వేసి విక్రయించేశారన్నారు. ప్రస్తుతం దేవదాయ భూముల్లో షాపింగ్ గదులు నిర్మిస్తున్నారన్నారు. ఈ విషయమై ఇది వరకే ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని, ఆయన మదనపల్లె రెవెన్యూ అధికారులకు లేఖ రాశారన్నారు. ఈ లేఖ సారాంశాన్ని పరిశీలించి దేవదాయ భూములను కాపాడాలని పునీత్ సబ్‌కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో బీవైఎస్ నేతలు జిలాని బాషా, ఆది, శశికుమార్, ద్వారక, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

21న ఉపన్యాస పోటీలు

కడప కల్చరల్ మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో ప్రసంగించే అవకాశం కోసం యువతకు ఈ నెల 21న శుక్రవారం కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కాలేజీలో ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి కె.మణికంఠ వెల్లడించారు. మంగళవారం బాలాజీనగర్‌లోని నెహ్రూ యువ కేంద్రం కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కడప, అన్నమయ్య జిల్లాల్లో 18 నుంచి 25 ఏళ్ల మధ్య వయసు గల యువతీ యువకులు ఈ ఉపన్యాస పోటీల్లో పాల్గొన వచ్చన్నారు. ఇందులో ప్రధానంగా వన్‌నేషన్, వన్ ఎలక్షన్ అనే అంశంపై ఉపన్యాస పోటీలో ఉంటాయన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన విజేత రాష్ట్ర, దేశస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. విజేతలకు నగదు బహుమతులతో పాటు ప్రశంసాపత్రం అందిస్తారన్నారు. ఇతర వివరాలకు 9177616677 అనే నెంబరును సంప్రదించాలని సూచించారు.

రేపు చేతివృత్తుల సంఘం నాయకులతో సమావేశం

కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఆదరణ-3 పథకం ద్వారా కుల వృత్తికి అవసరమైన ఆధునిక పనిముట్లు కోసం జిల్లాలోని బీసీ కుల, చేతివృత్తుల సంఘ నాయకులకు ఈనెల 20న ఉదయం 11గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ జయ సింహ ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో జరిగే ఈ సమావేశానికి హాజరవుతున్న బీసీ నాయకులు తమ సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. నాయీ బ్రాహ్మణ, రజక, వడ్డెర, మత్స్యకారుల, చేనేత, వడ్రంగి, స్వర్ణకారుల, కల్లు గీత కార్మికులు, కుమ్మరి, మేర, వాల్మీక బోయ, కృష్ణబలిజ, పూసల, సగర, ఉప్పర, శిల్పులు, కరెంటు పని, పాల వ్యాపారం చేసేవారు, ప్లంబర్లు తదితర చేతివృత్తులు చేసుకునే బీసీ కులాలకు చెందిన నాయకులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

24న గోవిందమాంబ ఆరాధన మహోత్సవాలు



వీరబ్రహ్మేంద్రస్వామి సమేత గోవిందమాంబ

బ్రహ్మంగారిమఠం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం దేవస్థానంలో ఈ నెల 24వ తేదీ గోవిందమాంబ ఆరాధన మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఫిట్ పర్సన్ శంకరబాలాజీ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాతా గోవిందమాంబ ఆరాధన మహోత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు, సాయంత్రం భజన కార్యక్రమాలు, రాత్రికి గ్రామోత్సవం ఉంటుందన్నారు. భక్తులు ఆరాధన మహోత్సవాల్లో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

కేబుల్ ఆపరేటర్ల సమస్యల పరిష్కారానికి కృషి

కడప(వినాయకనగర్), మార్చి18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఏపీ ఫైబర్‌నెట్ కేబుల్ ఆపరేటర్ల సమస్యలు సీఎం చంద్రబాబునాయుడి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని మాజీ మంత్రి పీతల సుజాత పేర్కొన్నారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రతిరోజు జరిగే గ్రీవెన్‌సెల్ కార్యక్రమానికి మంగళవారం ఏపీ ఫైబర్‌నెట్ కేబుల్ ఆపరేటర్ల జేఏసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నాగిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, చైర్మన్ నారాయణరావు, కార్యదర్శి కమ్మలపాటి సురేశ్‌బాబులు వెళ్లి మంత్రి వినతి పత్రం అందజేశారు. స్పందించి సుజాత వెంటనే సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు జేఏసీ నాయకులు తెలిపారు.

వల్లూరు యువకుడికి అరుదైన గౌరవం

వల్లూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్ననాగిరెడ్డిపల్లె లేబాక నరసింహారెడ్డి జాతీయ బుక్ ఆఫ్ రికార్డుల్లో ప్రత్యేక స్థానం సాధించాడు. తెలంగాణ బాష సంస్కృతీ శాఖ సౌజన్యంతో వెంకీ మ్యూజికల్ అకాడమీ వారి ఆధ్వర్యంలో ఈ నెల 16న హైదరాబాదులో 16గంటల పాటు సుమారు పది బాషల్లో నిరంతరాయంగా పాటలు పాడే పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచి జాతీయ బుక్ ఆఫ్ రికార్డుల్లో మరియు జీనియస్ బుక్ ఆఫ్ రికార్డుల స్థానం దక్కించుకున్నాడు. ఈ అవార్డును సమస్త అధినేత వెంకటేశ్ చేతుల మీదుగా అందుకున్నాడు.

12 మంది బెయిలుపై విడుదల

కడప క్రైం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలో వీరభద్రస్వామి ఉత్సవాల సందర్భంగా రెండు వర్గాల మధ్య తలెత్తిన వివాదంపై ఈ నెల 9న పోలీసులు కొంత మందిని అరెస్టు చేశారు. వీరికి కోర్టు రిమాండ్ విధించడంతో కడప సెంట్రల్ జైలులో ఉన్నారు. వీరిలో 12 మంది మంగళవారం బెయిలుపై విడుదలయ్యారు. విడుదలైన వారికి వారి బంధువులు స్వాగతం పలికారు.

ఒకే ఒక్కడు

- విభాగాలు ఐదు...అధికారి ఒక్కరు
- కొరవడుతున్న పర్యవేక్షణ
- అస్తవ్యస్తంగా సహకార వ్యవస్థ



కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా ప్రభుత్వ రంగ వ్యవస్థలో ఒక్కో విభాగానికి ఒక అధికారి ఉండడం నిబంధన. కానీ జిల్లాలోని సహకార వ్యవస్థలో ఐదు విభాగాలకు ఒకే అధికారి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దీంతో ఆశాఖపై పర్యవేక్షణ పూర్తిస్థాయిలో కొరవడుతోంది. ఇక ఆ అధికారి కూడా ఇన్‌చార్జి కావడంతో పాలన అస్తవ్యస్థంగా తయారవుతోంది. వివరాల్లోకెళితే...

జిల్లా సహకార శాఖ అధికారి సుబాషిణి కొన్ని నెలల క్రితం పదవీ విరమణ చేశారు. కడప డివిజన్ కోఆపరేటివ్ అధికారిగా పని చేస్తున్న ఆమె జిల్లా సహకారశాఖ అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టడం జరిగింది. ఆమె పదవీ విరమణ తర్వాత ప్రొద్దుటూరు డివిజనల్ కోఆపరేటివ్ సహకారశాఖ అధికారికి కడప డీఎల్సీఓగా, కడప జిల్లా సహకారశాఖ అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇవి కాకుండా కడపలోని హౌస్ బిల్డింగ్ సొసైటీ, జిల్లా కోఆపరేటివ్ ఆడిట్ అధికారి పోస్టులు కూడా ఆయనకే అప్పగించారు. ఈక్రమంలో ఒక అధికారి ఆయా శాఖలకు సంబంధించి పూర్తిస్థాయిలో విధులు నిర్వహించలేని పరిస్థితి. దీంతో ఒక్కో కార్యాలయానికి వారానికి ఒకరోజు కేటాయించినా కూడా ఏ పనిపై సమగ్రంగా దృష్టిసారించలేని పరిస్థితి.

కొరవడుతున్న పర్యవేక్షణ

సహకారశాఖ చాలా కీలకమైనది. వేలాది కుటుంబాలకు జీవనాధారమైన చేనేతరంగం, సహకార బ్యాంకింగ్ వ్యవస్థ, రైతులకు సేవలు అందించేందుకు పనిచేస్తున్న వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘాలు, మాక్స్ చట్ట పరిధిలో పనిచేస్తున్న సంఘాలు, పలు రకాల సొసైటీలకు ప్రయోజనాలు కల్పించేందుకు జిల్లా సహకారశాఖ అధికారి పాత్ర చాలా కీలకమైంది. కానీ ఈ పోస్టు సంవత్సరాల తరబడి ఇన్‌చార్జి అధికారుల పాలనలో కొనసాగుతోంది. జిల్లా కేంద్రంలోని డివిజనల్ సహకార శాఖ అధికారి పోస్టు కూడా ప్రస్తుతం ఇన్‌చార్జి అధికారి పాలనలోనే ఉంది. సహకార వ్యవస్థలోని సొసైటీలు సంఘాలకు సంబంధించిన నిర్వహణ బాధ్య తలను పర్యవేక్షించాల్సిన ఆడిట్ అధికారి పోస్టు కూడా ఖాళీగా ఉం ది. సంఘాల పనితీరుపై సమగ్రంగా ఆడిటింగ్ పనులను పర్య వేక్షించేందుకు రెగ్యులర్ అధికారి లేకపోవడంతో ఇబ్బందికరమైన పరిస్థతులు కనిపిస్తున్నాయి. దీంతో చాలా వరకు సొసైటీల్లో ఉద్యో గ నియామకాల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారంటూ ఆడిటింగ్ అధికారులు నోటీసులు ఇచ్చారు. అదేవిధంగా పలు సొసై టీల్లో అక్రమాలు జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై విచారణ కుంటు పడుతోంది. ఇక సహకార హౌస్‌బిల్డింగ్ సొసైటీలో రెగ్యులర్ అధి కారి అందుబాటులో లేకపోవడంతో అక్కడ పనులు ఆశించినంత మేర జరగడం లేదనేది స్పష్టం అవుతుంది.

పదోన్నతుల కోసం ఏళ్ల తరబడి నిరీక్షణ

సహకారశాఖలో అధికారులు పదోన్నతుల కోసం దాదాపు దశాబ్దాల తరబడి నిరీక్షస్తున్నారు. ఉన్నతాధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నా, పదోన్నతులకు అర్హులైన అధికారులు ఉన్నప్పటికి సహకారశాఖ, ప్రభుత్వాలు ఆ దిశగా తగిన చర్యలు తీసుకోకపోవడంతో అధికారులు కూడా నిరాశ నిస్పృహలో ఉన్నారు. దీంతో కీలకమైన శాఖలో సమర్థవంతమైన అధికారులు రెగ్యులర్‌గా లేకపోవడం వల్ల ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సహకార శాఖలో అధికారులకు పదోన్నతులు కల్పించే దిశగా అడుగులు పడుతున్నట్లు తెలుస్తోంది. జోన్, జిల్లాస్థాయిలో అధికారుల సర్వీసు, రోస్టర్ పాయింట్ ఆధారంగా పదోన్నతులు సంబంధించిన సీనియారిటీ జాబితాను రూపొందించినట్లు తెలు స్తోంది. త్వరితగతిన సహకార శాఖలో అధికారులకు పదోన్నతులు కల్పిస్తే రెగ్యులర్ అధికారులకు అదనపు బాధ్యతలు తప్పే పరిస్థితి లేకపోలేదు. ప్రభుత్వం, సహకార శాఖ ఉన్నతస్థాయి అధికార యంత్రాంగం పదోన్నతుల విషయంలో దృష్టిసారించి సహకార వ్యవస్థను గాడిలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అధికారిక ఉత్తర్వులు గౌరవించక తప్పదు

అధికారిక ఆదేశాల మేరకు నడుచుకుంటూ వారి ఉత్తర్వులను గౌరవించడం ప్రతి అధికారికి తప్పదు. ప్రస్తుతం సహకార వ్యవస్థలో కంప్యూటరీకరణ జరుగుతోంది. జిల్లాలో దాదాపు 60శాతం పూర్తయింది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాతనే మిగతా పనులు ఏవైన జరిగే అవకాశాలు ఉన్నాయి.

– సురేష్‌కుమార్, జిల్లా సహకార శాఖ అధికారి (ఎఫ్ఏసీ)

'ఉపాధి'లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవు

- డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి

చక్రాయపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథ కంలో అవకతవకలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాత్రి చక్రాయపేటలో సామాజిక తనిఖీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చక్రాయపేట మండలం కరువుకాటకాలకు నిలయమని, భూగర్భజలాలు అడుగంటి నీటి ఎద్దడి ఏర్పడిందన్నారు. రాబోయే రోజుల్లో నీటి గుంతలకు, ఫారం పాండ్స్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. త్వరలో జిల్లాలో ఉపముఖ్యమంత్రి పర్యటిస్తున్నారని, చక్రాయ పేట కు వచ్చే అవకాశం ఉందన్నారు. అనంతరం మండలంలోని 14 గ్రామాల వారీగా ఉపాధి పనులకు సంబంధించి రికార్డులు పరిశీలించి రూ.55,227 రికవరీ చేశామన్నారు. రూ.71వేలు జరిమానా విధించామన్నారు. అలాగే హౌసింగ్, పంచాయ తీరాజ్ శాఖలకు సంబంధించి రూ.1.53 లక్షలు జరిమానా విధించామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీ సోమ శేఖర్‌రెడ్డి, డీఈ రామలింగేశ్వర్ రెడ్డి, క్వాలిటీ ఈఈ విజయ భాస్కర్, ఏపీఓ గంగరాజు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ప్రభుత్వ భూముల కబ్జా

- అఖిలపక్ష ఐక్యవేదిక కన్వీనర్ ఆంజనేయులు



కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలిస్తున్న అఖిలపక్ష నాయకులు

సీకేదిన్నె, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కడపలో గత అయిదు సంవత్సరాల్లో నగరం చుట్టుపక్కల ప్రాంతాల్లో భూ మాఫియా పెట్రేగిపోయిందని అఖిలపక్ష ఐక్యవేదిక కన్వీనర్ కారు ఆంజనేయులు తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం ఊటుకూరు సర్వే నంబరు 235-2లో ఉన్న 42.75 ఎకరాల ప్రభుత్వ భూమిని మంగళవారం అఖిలపక్ష నాయకులతో కలిపి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడపలో భూకబ్జాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని, ప్రభుత్వ భూమి ఖాళీగా కనపడితే అధికారులను మేనేజ్ చేసి భూదందా కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారబలంతో కోట్ల విలువచేసే భూములను తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి సొంతం చేసుకుంటున్నారన్నారు. తాము పరిశీలించిన భూమిలో 42.75 ఎకరాలకు 36.95 ఎకరాలభూమి ఉందని.. అయిదు ఎకరాలకుపైగా కబ్జాకు గురైందన్నారు. ఇక్కడున్న రైల్వే పంప్‌సెట్ కూడా పగులకొట్టి భూకబ్జాదారులు వెంచర్లు వేశారన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష రాజకీయ ప్రజాసంఘ నాయకులు, చేతివృత్తుల జాతీయ కన్వీనర్ అవ్వారు మల్లికార్జున, రైతు స్వరాజ్య వేదిక పుత్తా శివారెడ్డి, దళితమిత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, లోక్‌సత్తా పార్టీ జిల్లా కన్వీనర్ దేవరకృష్ణ, హేతువాద సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సీఆర్‌వీ ప్రసాద్, గేటర్ రాయలసీమ అభివృద్ధి వేదిక జిల్లా కన్వీనర్ ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న పెట్రోల్ ట్యాంకర్... డ్రైవర్ మృతి



మృతి చెందిన డ్రైవర్

ఎర్రగుంట్ల, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్లలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఖాదరయ్య (41) అనే డ్రైవర్ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.... సత్యసాయి జిల్లా ఎన్‌పీ కుంటకు చెందిన ఖాదరయ్య హిందూస్థాన్ పెట్రోలియం (హెచ్‌పీ)కార్పొరేషన్‌లో ట్యాంకర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గుత్తిలో ట్యాంకర్‌కు పెట్రోల్ లోడ్ చేసుకుని కడప వైపు బయలుదేరాడు. ఎర్రగుంట్ల ఫ్లైహోం సమీపంలోకి రాగానే ముందువెళుతున్న లారీని వేగంగా ఢీకొంది. దీంతో ట్యాంకర్ లారీలోకి చొచ్చుకు పోయి డ్రైవర్ ఖాదరయ్యకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై దాడి- కేసు నమోదు

కొండాపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మా పురం క్రాస్ వద్ద వ్యక్తిపై దాడి చేసిన సంఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానిక తిమ్మాపురం క్రాస్ వద్ద సింహాద్రి పురం మండలం బిదెనంచెర్ల గ్రామానికి చెందిన నరసింహులుపై అనంతపురం జిల్లా సజ్జలదిన్నెకు చెందిన లక్ష్మయ్య, చిరంజీవిలు దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సమష్టి కృషితో విద్యుత్ ప్రమాదాల నివారణ



మాట్లాడుతున్న ఎస్‌ఈ రమణ

కమలాపురం రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాలను సమష్టి కృషితో నివారించవచ్చని విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీరు ఎస్.రమణ తెలిపారు. కమలాపురంలోని మున్సిపల్ ఆఫీసు ఎదురుగా మంగళవారం రాత్రి విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వ హించారు. విద్యుత్ ప్రమాదాల వల్ల కలిగే నష్టాలను షార్ట్‌ఫిలిం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రమణారెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కిరణ్, అసిస్టెంట్ ఇంజనీరు చాంద్‌బాషా, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యం... బాలచంద్రుడు ఆదర్శం



జీవామృతం తయారు చేస్తున్న రైతు

చెన్నూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకంతో భూమి నిస్సారమై.. ఏ పంట సాగు చేసినా పెట్టిన పెట్టుబడులు రాక విసిగిపోతున్న రైతన్నల పరిస్థితులను కళ్లారచూసిన ఆయనను ఆలోచనల్లో పడేశాయి. ఈ నేపథ్యంలో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే దిశగా రైతు బాలచంద్రుడు ప్రకృతి వ్యవసాయానికి శ్రీకారం చుట్టారు. 2018లో నాటి టీడీపీ ప్రభుత్వ హయాంలో గుంటూరులో నిర్వహించిన జీరో బడ్జెట్ ప్రకృతి వ్యవసాయంలో సుభాష్ పాలేకర్ శిక్షణలో పాల్గొని పలు అంశాలు తెలుసుకున్నారు. అలాగే మహారాష్ట్రలో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న పంటలను ప్రత్యక్షంగా పరిశీలించి.. సాంప్రదాయ వ్యవసాయ పద్ధతుల్లో పంటల సాగుకు చేపట్టడం మొదలు పెట్టారు.

మండలంలోని కనుపర్తి గ్రామానికి చెందిన రైతు బాలచంద్రుడు బీఎస్సీ చదివారు. ఈయ న తండ్రి నుంచి సంక్రమించిన ఐదు ఎకరాల భూమిలో సంప్రదాయ వ్యవసాయ పద్ధతుల్లో పసుపు, వరి, టమోటా, మిరప, కాకర, నువ్వులు, వంకాయ, దోస వంటి పంటలు సాగు చేస్తున్నారు. ద్రవ జీవామృతం, పంచగవ్య, ఆవాల పిండి, సైంధవ లవణం లాంటివి పంటల సస్యరక్షణకు ఉపయో గిస్తూ.. మంచి దిగుబడులు సాధిస్తున్నారు. తోటి రైతులను ప్రకృతి వ్యవసాయం చేపట్టేలా ప్రోత్సాహిస్తున్నారు. అంతేగా కుండా ప్రొద్దుటూరు, గుంతకల్లు, వరంగల్ తదితర ప్రాంతాలకు వెళుతూ రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగా హన కల్పిస్తు న్నారు. ఇక ఈ ఏడాది రిపబ్లి క్‌డే రోజున రైతు బాలచంద్రుడు తన ఉత్పత్తులను ప్రదర్శించడంతో కలెక్టరు చెరుకూరి శ్రీధర్, వ్యవసాయాధికారి నాగేశ్వర్‌రావు, జిల్లా ప్రాజెక్టు మేనేజరు ప్రవీణ్ కుమార్‌లు పరిశీలించి ప్రశంసించారు.



సేంద్రియ పద్ధతుల్లో సాగు చేసిన పసుపు పంట కళకళలాడుతున్న దృశ్యం,

పసుపు పంట సాగులో...

గత ఏడాది 2 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరిస్తూ పసుపు పంట సాగు చేశాడు. రెండు ఎకరాల సాగుకు 2.7 లక్షలు పెట్టుబడి పెట్టి రూ.10 లక్షలపైన ఆదాయాన్ని సంపాదించాడు. ఇక ఆయన పండించిన పసుపు దేశంలోనే అత్యంత నాణ్యతగా ఉందని పలువురు శాస్త్రవేత్తలు ప్రశంసించినట్లు తెలిపారు. ముఖ్యంగా మహారాష్టకు చెందిన ఓ సంస్థ 25 క్వింటాళ్ల పసుపు కొనుగోలుకు ముందస్తుగా ఆర్డరు ఇచ్చినట్లు రైతు తెలిపారు.

రసాయనాలతో భూమి నిస్సారం

రైతులు పంటల సాగులో విరివిగా రసాయనాలు వాడితే భూమి నిస్సారమవుతుందని.. ఇది భవిష్యత్తులో తీరని నష్టం కలిగిస్తుందని రైతు బాలచంద్రుడు అంటున్నారు. అంతేకాక తల్లి తన బిడ్డను కడుపులో 9 నెలలు మోస్తే... నేలతల్లి జీవితాంతం మోస్తుందని.. అందుకే ప్రతి రైతు భూమిని కాపాడుకోవాలని చెబుతున్నారు.

జిల్లా పేరు మార్చడం హర్షణీయం

- ప్రజల మనోభావాలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం
- టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఇ.హరిప్రసాద్



విలేకరులతో మాట్లాడుతున్న హరిప్రసాద్

కడప ఎర్రముక్కపల్లె, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ జిల్లా పేరును వైఎస్సార్ కడప జిల్లాగా పేరు మార్చడం పట్ల జిల్లా ప్రజలు హర్షిస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బి.హరిప్రసాద్ అన్నారు.

మంగళవారం హరటవర్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కడపకు ఎంతో చరిత్ర ఉందని.. తిరుమల తొలి గడప కడప అని.. మత సామరస్యానికి ప్రతీక అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లా ప్రజల మనోభావాలను అర్థం చేసుకొని మంత్రివర్గ సమావేశంలో వైఎస్సార్ జిల్లా పేరు ను వైఎస్సార్ కడప జిల్లాగా మారుస్తూ తీసుకున్న నిర్ణయం పట్ల జిల్లా ప్రజలందరు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం ఎంతో చరిత్ర కలిగిన కడప జిల్లాను వైఎస్సార్ జిల్లాగా పేరు మార్చిందని.. అప్పటి నుంచి ఎన్నో ఆందోళనలు చేసినా పట్టించుకోలేదున్నారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం పేరు మారుస్తూ నిర్ణయం తీసు కుందని.. అందుకు జిల్లా ప్రజల తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు నాగరాజు, గంధం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పద్మవ్యూహంలో పులివెందుల

పార్కింగ్ స్థలాలు లేవు ● కనిపించని సూచిక బోర్డులు ● ఆక్రమణలతో కుచించుకుపోయిన రోడ్లు

పులివెందుల టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : పులివెందుల పట్టణంలో ట్రాఫిక్ కష్టాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దీంతో వాహనదారులు రోడ్డుపై ప్రయాణించాలంటేనే భయపడుతున్నారు. పట్టణంలో తిరుగుతున్న జనాభా కారణం గా వాహనాల సంఖ్య అదే తరహాలో పెరుగుతోంది. అయితే పట్టణంలో దశాబ్దాలకాలంగా అవే రోడ్లు కావడంతో ట్రాఫిక్ సమస్య పెరిగిపోయింది. మున్సిపాలిటీ, ఆర్‌అండ్‌బీ, పోలీసుల తో పాటు వివిధ శాఖల అధికారుల్లో నెలకొకసారి సమావేశమై పలు అంశాలపై సమీక్షించాలి. కానీ పులివెందులలో ఆ దాఖలాలు కనిపించడంలేదు. అనేక షాపింగ్‌మాల్స్, బ్యాంకులు, రెస్టారెంట్లు, కాంప్లెక్స్‌లు, అద్దెభవనాల్లో ఉన్న ప్రభుత్వ కార్యకలాపాలకు ఎక్కడా పార్కింగ్ స్థలాలు లేవు. అదే విధంగా ఆటోస్టాండ్లు అసలు లేవు. హైదరా బాదు, బెంగళూరు పోవు ప్రైవేటు ట్రావెల్స్ ఎక్కడ పడితే అక్కడ ఆపడం వల్ల ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రంగా మారింది. రోడ్డు పక్కన ఆక్రమణలు చేయడం కూడా ట్రాఫిక్ సమస్యలకు మరో కారణంగా చెప్పవచ్చు. ఉదయం 10నుంచి సాయంత్రం 5 వరకు మెయిన్‌బజారు, ఆర్టీసీ బస్టాండు సర్కిల్, పార్నపల్లె రోడ్డు ప్రాంతాల్లో వ్యాపార సంస్థల వారికి సరుకులు తీసుకువచ్చే వాహనాలు అన్‌లోడ్ చేసే సమయంలో ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోతుంది. ఇక దుకాణాల్లో వస్తువులు కొనుగోలు చేసేందుకు ద్విచక్ర వాహనాల్లో కార్లలో వస్తేపార్కింగ్ స్థలం లేకపోవడంతో ఇరుకుగా ఉన్న ఆ రహదారుల్లోనే వాహనాలను అడ్డదిడ్డంగా నిలిపివేస్తున్నారు. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



లయోలా కాలేజీ రోడ్డులో వాహనాల రద్దీ

మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం..: పట్టణంలో రోడ్డు మార్జిన్‌లు ఆక్రమణలు జరిగినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదు. పట్టణంలోని పూలంగళ్ల సర్కిల్ వద్ద పండ్ల దుకాణాలు రోడ్డుపైనే ఉన్నాయి. ఇదే తరహాలో అనేక ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారం చేస్తున్నారు.రోడ్డు పక్కన పార్కింగ్‌లైన్లు లేకపోవడం, ఇష్టానుసారంగా వాహనాలు పార్కింగ్ చేయడం పరిపాటిగా మారింది. అదే విధంగా పట్టణంలో లయోలా కాలేజీ వెళ్లే రోడ్డులో మాంసం మార్కెట్ వద నిత్యం ట్రాఫిక్ సమస్యనే. అలాగే నూతనంగా పట్టణంలో బోలే వార్డు ఏర్పాటు చేయడం ద్వారా రోడ్డు కుదించుకు పోయి ట్రాఫిక్ సమస్య తీవ్రస్థాయికి చేరింది. అలాగే పట్టణంలోని బంగారు బజారు, పార్నపల్లె రోడ్డు, శ్రీరామ హాలు రోడ్డు వ్యాపారులు ఆక్రమించడంతో రోడ్డు కుదించుకుపోయి ట్రాఫిక్ సమస్య జటిలమవుతుంది. కొందరు అయితే ఏకంగా రోడ్డు పార్కింగ్ స్థలాలు ఆక్రమించి మరీ కట్టేశారు.

సెల్‌ఫోన్లకే పరిమితం..: విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ సిబ్బంది అనేక మంది సెల్‌ఫోన్లకు పరిమితమవు తున్నారు. వారు విధులు నిర్వహిస్తున్న ప్రాంతాల్లో ట్రాఫిక్ నిలిచిపోయినా కన్నెత్తి చూడడంలేదు.

అన్నిరకాల చర్యలు చేపడతాం

త్వరలో ప్రతి ఆటోకు పోలీసు నెంబర్లు ఇస్తాం, నిర్ణీత ప్రదేశాల్లో మాత్రమే ఆటోలు నిలపాలని సూచించాం. కొంత మేర మార్పు వచ్చింది. పూర్తిగా వారు ఆ విధానాలు పాటించే విధంగా చర్యలు తీసుకుంటాం, ట్రాఫిక్ నియంత్రణకు అదనపు సిబ్బందిని కూడా కేటాయిస్తాం. అన్ని శాఖల అధికారులను సమిష్టిగా నిర్ణయం తీసుకుంటాం. విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ సిబ్బంది సెల్‌ఫోను చూసుకుంటూ నిర్లక్ష్యంగా ఉంటే అలాంటి వారిపై చర్యలు తీసుకుంటాం..

● హాజీవలి, ట్రాఫిక్ సీఐ

నీటి సమస్యను పరిష్కరిస్తాం

వేంపల్లె, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పాపాఘ్ని నదిలో ఫిల్టర్లు వేయించి, పట్టణంలో బోర్లు వేయించి తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని ఇన్‌చార్జి సర్పంచు ఆర్.శ్రీను తెలిపారు. పాపాఘ్ని నదిలో ఉన్న పంచాయతీ ఫిల్టర్లను పరిశీలించారు. పలు ఫిల్టర్లు ఎండిపోగా కొన్ని భూగర్భజలాలు అడుగంటాయి. అలాగే పట్టణంలోని పలు ప్రాంతాల్లోని బోర్లను పరిశీలించారు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో యుద్ధప్రాతి పదికనచర్యలు తీసుకుంటామని తెలిపారు.

షాదీఖానాలు నిర్మించండి



మంత్రి ఫరూక్‌తో మాట్లాడుతున్న పేర్ల పార్థసారధిరెడ్డి

వేముల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గంలోని వేముల, చక్రాయపేట, లింగాల తదితర మండ లాల్లో షాదీఖానాలు నిర్మించాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధిరెడ్డి కోరారు. మంగళవారం విజయవాడలో మైనారిటీ సంక్షేమ శాఖామంత్రి ఎన్.ఎండీ ఫరూక్‌ను కలిసి మాట్లాడారు. అలాగే మంత్రులు డోలా బాల వీరాంజనేయ స్వామి, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహ రెడ్డి,గొట్టిపాటి రవికుమార్‌ను కలిశారు. పలు సమస్యలను వివరించి పరిష్కరిం చాలని కోరారు.

ఈ-కేవైసీ చేయించుకోవాలి

వేంపల్లె, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె మండలంలోని రేషన్ కార్డులో ఉన్న సభ్యులు ఇంకా ఎవరైన ఈ-కేవైసీ చేయించుకోనట్లయితే వెంటనే డీలర్ల వద్దకెళ్లి చేయించుకోవాలని తహసీల్దార్ హరినాథ్‌రెడ్డి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. డీలర్ల సమావేశం నిర్వహించి పెండింగ్‌లో ఉన్న సభ్యులను నమోదు చేయించాలని సూచించినట్లు తెలిపారు. మండలంలో ఈ-కేవైసీ లేని వారు 5300 మంది సభ్యులు ఉన్నారన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



వేంపల్లె, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఎన్ఎస్ఎస్ అధికారి దీప్తి విద్యార్థులకు సూచించారు. ఇడుపుల పాయ ట్రిపుల్ ఐటీలో సోమవారం మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సమా వేశం నిర్వహించారు. మొదట ర్యాలీ నిర్వహించారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/s Shriram City Union Finance limited, Kadapa-I Branch Issues the following notice to the general public My client Intends to grant loan to 1) **Ravavaram Venkata Surendhar, S/o, R.Chendrayudu, 2) Smt.Rayavaram Vijayalakshmi, w/o R.Venkata Surendhara,** R/o, 9-107-A-3, Gandhi Nagar road, Vempalli, village, and Mandal, Y.S.R, Dist. by mortgaging the below schedule mentioned property as security by way of equitable mortgage. As such If anyone has any claims, objections, charges or mortgages, sale agreements, court attachments, court disputes etc., shall be informed to the address mentioned below in writing within 7 days from the date of this notice, otherwise matter objetions will not bind on my client in this regard. **SCHEDULE OF THE PROPERTY:** Residential building bearing 9/107-3, situated in Kadapa Dt. Proddatur Registr-ation Office, Vempalli Sub Dist, Vempalli Mandal and Village, Assessment no. 7378, Vempalli, Village fields. To an extent of Ac. 0.02 1/2 cents or 121 Sq. yard out of Ac. 1.56 cents, Sy.No. 389 of Vempalli Village Fields **BOUNDARIES** : EAST : House of Surku Kulayyappa, WEST: House of Kasi Vishwanadham, NORTH: Vanka Poramboku, SOUTH: Gandhi Road

Yours faithfully
SHAIK KHAJA MOHIDDIN
M.A. M.Phil. BL., Advocate & Notary

వేసవిలో కార్మికులు అప్రమత్తంగా ఉండాలి

కడప(వినాయకనగర్), మార్చి18(ఆంధ్రజ్యోతి): వేసవిలో కార్మికులందరూ అప్రమత్తంగా ఉండాలని కార్మికశాఖ ఉప కమిషనర్ శ్రీకాంత్‌నాయక్ తెలిపారు. కార్మికుల రక్షణ కోసం యాజమాన్యాలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు.మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బహిరంగ కార్మికుల పనివేళలను మార్పు చేయాలన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు

కమలాపురం రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : వేసవి కాలం దృష్టిలో ఉంచుకుని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి కొరత లేకుండా చర్యలు చేపట్టామని ఎంపీడీవో జ్యోతి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని దేవరాజుపల్లె గ్రామంలో ఆమె పర్యటించారు. వాటర్ ట్యాంకుదగ్గర చెత్త వేస్తే రూ.2వేలు జరిమానా విధించబడుతుందని తెలిపే పోస్టరు అతికించామన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ , ఆర్డీ కెజియా రాజేశ్, సర్పంచ్ నీలం వెంకటలక్షుమ్మ, పంచాయతీ కార్యదర్శి గంగాధర్ పాల్గొన్నారు.

కొత్త వ్యక్తులు కనిపిస్తే అడ్రస్, ఆధార్ నెంబర్లు తీసుకోవాలి : సీఐ

చెన్నూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా కొత్త వ్యక్తులు ఎవరైనా సంచరిస్తున్నా, వారు బయటి ప్రాంతాల నుంచి వచ్చి చిన్న, చిన్న వ్యాపారులు చేసుకుంటు న్నా అలాంటి వారి అడ్రసు, ఆధార్ నెంబరు సేకరించాలని సీఐ పురుషోత్తంరాజు స్టేషను సిబ్బందికి సూచించారు. మంగళవారం స్టేషను సిబ్బందితో మాట్లాడుతూ ఇటీవల కాలంలో పలు చోట్ల కొత్త వ్యక్తుల వల్ల సమస్యలు వస్తున్నా యని అలాంటి వారి కదలికలపై నిఘా పెట్టాలన్నారు. అలాగే వారు రాత్రివేళ ఎక్కడైనా బస చేస్తే ఆ ప్రాంత ప్రజలుకూడా వారిని గమనించి వారి కదలికలను చూసి పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

తప్పుడు ఫిర్యాదులు చేస్తే చర్యలు..:ప్రజలు చేసే ఫిర్యాదులు తప్పుడువిగా తేలితే అలాంటి వారిపై చర్యలు తప్పవని సీఐ పురుషోత్తంరాజు అన్నారు. చెన్నూరు పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఆయన పలువురు ఫిర్యాదు దారులతో మాట్లాడారు. ఫిర్యాదుదారుడు ఎవరైనా తనకు నిజంగా నష్టం జరిగితే ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

విద్వేషాలు వద్దు..: మత సామరస్యానికి ప్రతీక అయిన చెన్నూరులో విద్వేషాలు రగిల్చే పనులు చేయవద్దని సీఐ పురుషోత్తంరాజు మండల ప్రజలకు సూచించారు. చెన్నూరు స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ జరగబోయే రోజుల్లో ఉత్సవాలు, జాతర్లు, పండుగలు లాంటివి ఎన్నో ఉన్నాయని అలాంటి సమయంలో ఒకరికొకరు సహకరించుకుంటూ సంతోషంగా ఉండాలన్నారు.

రైతులు విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలి

సీకేదిన్నె, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రైతులు విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని ఏవో ఈశ్వర్‌రెడ్డి తెలి పారు. కమ్మవారిపల్లె, అప్పరాజుపల్లె గ్రామాల్లో పొలం పి లుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రతి రైతుకు ఆధార్ కార్డు నంబరు వలనే 14 నంబర్ల విశిష్ట సంఖ్య ఇవ్వడం జ రుగుతుందన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

'స్వర్ణాంధ్ర 2047పై సీఎం మాట్లాడడం హాస్యాస్పదం'

వేంపల్లె, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర 2047 గురించి ముఖ్యమంత్రి, వికసిత భారత్ 2047 గురించి ప్రధానమంత్రి పదేపదే చెప్పడం విడ్డూరం, హాస్యాస్పదమని ఏపీసీసీ ముఖ్య అధికారప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన వేంపల్లెలో మాట్లాడుతూ 2047 అంటే ఇంకా 22ఏళ్లు అప్పటికి ఎవరం ఉంటామో ఎవరం ఉండమో తెలియదు, ఏ పార్టీ ఉంటుందో, ఏ పార్టీ కాలగర్భంలో కలిసిపోతుందో తెలియదన్నారు. ప్రజలు అధికారం అప్పగించింది 2029 వరకు కాబట్టి అప్పటికి ఏం చేస్తారో చెబితే సమంజసంగా ఉంటుందని అన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



సీకేదిన్నె,మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బయనప ల్లి అభయాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాప న మంగళవారం ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం భూమిపూజ చేసి శంకుస్థాపన కార్యక్రమం, రాతి శంఖు, కలశాలు ప్రతిష్ఠించి గ్రామస్థులతో పూజలు నిర్వ హించారు. అనంతరం గ్రామస్థులు నవధాన్యాలు, నవరత్నా లు సమర్పించి శంకుస్థాపనను ఘనంగా నిర్వహించారు. అ నంతరం కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు

అదనపు నిధులతో పక్కాగృహాలు పూర్తి చేసుకోండి



మాట్లాడుతున్న ఏఈ మినిల్‌కుమార్

చెన్నూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పక్కాగృహాలు మంజూరై ఇంకా పూర్తి చేయని ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు రాష్ట్రప్రభుత్వం అదనపు నిధులు మంజూరు చేసిందని హౌసింగ్ ఏఈ మినిల్‌కుమార్ అన్నారు. స్థానిక హౌసింగ్ కార్యాలయంలో మంగళ వారం సాయంత్రం సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించి మాట్లా డారు. మండలానికి 672 పక్కాగృహాలు మంజూరు చేసి జగనన్న లేఅవుట్ పేరుతో కనుపర్తి వద్ద నిర్మాణ పనులు చేపట్టిందని, అదే సమయంలో మిగిలిన గ్రామ పంచా యతీల్లో 65 పక్కాగృహాలు సొంతంగా కట్టుకు నేందుకు మంజూరు చేసిందన్నారు. బీసీలకు 50వేలు, ఎస్సీ, ఎస్టీలకు 75వేలు మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

'అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టాలి'

కడప నాగరాజుపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విద్యాశాఖలో రూ.6కోట్ల అవినీతిని మూటగట్టుకున్న ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ బి.సాంబశివారెడ్డిపై అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డికి ఆర్ఎస్ఎఫ్, టీఎన్ఎస్ఎఫ్ ప్రతినిధులు విన్నవించారు. మంగళవారం కడపలోని ఆయనను కలిసి ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డీ.ఎం.ఓబులేసు యాదవ్, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేష్ వినతిపత్రం అందించారు.దీనిపై శ్రీనివాసరెడ్డి స్పందిస్తూ విచారణ రిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు

కమలాపురం రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ స్థలాలు ఎవరు ఆక్రమించినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దారు శివరాంరెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని ఎర్రబల్లె, కొత్తపల్లె ఎస్సీకాలనీలోని ఇళ్లస్థలాలు సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి,ఓబుల్‌రెడ్డి ఆక్రమించారని గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో ఆయన అక్కడికి వెళ్లి ఆ స్థలాన్ని పరిశీలించారు. ఎస్సీ ల స్థలాన్ని ఆక్రమించడం దుర్మార్గమని తమ కు న్యాయం చేయాలని ఎస్సీకాలనీ వాసులు తహసీల్దారును వేడుకున్నారు. అక్కడే గతంలో వారికి ఇచ్చిన ఇంటిపట్టాలను తహసీ ల్దారుకు చూపించారు. ఈ విషయమై తహసీల్దారు శివరామిరెడ్డిని వివరణ కోరగా ఆక్రమణకు గురి అయినట్లు తెలిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

చెన్నూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే పరిశుభ్రత ఎంతో ముఖ్యమని ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు అన్నారు. మండలంలోని గుర్రంపాడు గ్రామ పంచాయతీలో మంగళవారం ఈవోపీఆర్డీ సురేశ్‌బాబుతో కలిసి చెత్త సేకరణ చేపట్టారు. ఆటోలు ఏర్పాటు చేసి ప్రతి ఇంటికీ తడి, పొడి చెత్త బుట్టలు పంపిణీ చేసి వాటి ద్వారా చెత్త సేకరణను చేపట్టారు. తడి పొడి చెత్తలను వేర్వేరుగా అందించాలని అవగాహన కల్పిం చారు. అనంతరం ఆటోలో మైకులు పెట్టించి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

క్లాప్ డ్రైవర్లకు రూ.26వేల వేతనం ఇవ్వాలి

కడప సెవెన్ రోడ్స్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా క్లాప్ వాహనాల డ్రైవర్లకు రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయూ ఆఫీసులో జరిగిన విలేకరుల సమావేశంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు మనోహర్, జిల్లా కోశాధికారి ఎస్.గోపి తెలిపారు. మనోహర్ మాట్లాడుతూ ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, కడప ప్రాంతాల్లో రెడ్డి, పావని ఏజెన్సీ ద్వారా నడిచేవని గుర్తుచేశారు.

డ్రంకెన్ డ్రైవ్‌కేసులో 14 మందికి జరిమానా

క్రైం, మార్చి18(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన 14మందిపై కేసు నమోదు చేసి మంగళవారం కోర్టులోని మేజి స్ట్రేట్ హాజరుపరిచినట్లు ట్రాఫిక్‌సీఐ జావేద్ తెలిపారు. ఆయన వివరాల మేరకు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు సమా చారం రావడంతో బ్రీత్ అనలైజర్‌తో తనిఖీ నిర్వహించి 14 మందిపై కేసు నమోదు చేసి నట్లు తెలిపారు. వారందరిని మేజిస్ట్రేట్ ఎదు ట హాజరచగా 3500 రూపాయు జరిమానా, 13మందికి 14రోజులు జైలు శిక్ష, ఒకరికి వారం రోజులు శిక్ష విధించినట్లు తెలిపారు.

'విద్యుత్ భారాలపై చిత్తశుద్ధితో వ్యవహరించాలి'

కడప కలెక్టరేట్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): విద్యుత్ భారాలపై కూటమి సర్కారు చిత్తశుద్ధితో వ్యహరించాలని వినియోగదారుల పై ఆర్థిక భారాన్ని తగ్గించాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయజ్యోతి ప్రభుత్వాన్ని డిమాం డ్ చేశారు. మంగళవాం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నగర అధ్యక్షుడు అఫ్జల్ ఖాన్, కో-ఆర్డినేటర్ బండి జకరయ్యతో కలసి పాత్రికేయుల సమావేశం నిర్వహిం చారు. అలాగే ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని అమరా వతికి తరలించవద్దని, కడపలోనే కొనసా గాలని యూనియన్ అధ్యక్షుడు హను మంతరెడ్డి, మహమ్మద్, గౌతమ్‌లను కలసి విజయజ్యోతి వినతి పత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో నాయ కులు అలీఖాన్. రంతుల్లాఖాన్, గౌస్ పీర్, సిరాజుద్దీన్, రఫీక్ ఖాన్, గౌరీ దేవి, చిన్నకుళ్లాయప్ప,సంజయ్‌కాంత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయజ్యోతి

ఎట్టకేలకు మొదలైన తారురోడ్డు నిర్మాణ పనులు

లింగాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): లింగాల నుంచి కృష్ణంగారిపల్లెకు వెళ్లేరహదారి కంకరపరిచి అసం పూర్తిగా ఉన్న రోడ్డును పూర్తి చేసేందుకు ఎట్టకేలకు ఆదివారం తారురోడ్డు పనులను మొదలు పెట్టారు.కంకరపరిచిన రహదారిపై వాహనాలలో వెళ్లేందుకు ఇన్ని రోజులు ప్రజలురైతులు ఇబ్బందులు పడ్డారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద రూ.8.92కోట్ల నిధులతో 2021లో తారురోడ్డు మంజూరు అయింది. మొత్తం 15.58కిలోమీటర్ల దూరం. పులివెందుల నుంచి ముద్దనూరు వెళ్లే ప్రధాన రోడ్డు మార్గంలో కృష్ణంగారిపల్లె వద్ద ఈ రోడ్డు కలుస్తుంది. పలు కారణాలతో సుదీర్ఘకాలంగా రోడ్డు నిర్మాణపనులు జాప్యం కావడం, ఎట్టకేలకు తిరిగి మొదలుకావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఘనంగా రాహుకాల పూజలు



కడప కల్చరల్ మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : నగర బిల్టప్ సమీపంలో ఉన్న విజయ దుర్గమ్మ ఆలయంలో మంగళవారం ఘనంగా రాహుకాల పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 వరకు రాహుకాల పూజలు నిర్వహించారు. అలా పూజలు చేసి దీపాలు వెలిగించడం వల్ల మనసులో అనుకున్న కోరికలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారి సన్నిధికి చేరుకుని పూజలు నిర్వహిస్తున్నారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి వస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు మల్లికార్జునరావు, నిర్వాహకుడు దుర్గాప్రసాద్ తెలిపారు.

జిల్లా పేరు మార్పు హర్షణీయం



శ్రీనివాసరెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం కడప జిల్లాను, వైఎస్సార్ జిల్లాగా మార్పు చేయడాన్ని వ్యతిరేకిస్తూ చాలా మంది ఫిర్యాదులు చేయడంతో నిన్న జరిగిన కేబినెట్ సమావేశంలో వైఎస్సార్ కడప జిల్లాగా నిర్ణయించడం హర్షణీయం, జిల్లా పేరు మార్పును అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు స్వాగతిస్తు న్నాయని, వైసీపీ నాయకులు కూడా స్వాగతించాలని టీడీపీ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కడప నగరం ద్వారకానగర్ ఆయన విలేకరులతో మాట్లాడుతూ మే నెలలో నిర్వహించే టీడీపీ మహానాడు కార్యక్రమాన్ని పండుగలా నిర్వహిస్తామని చెప్పారు.

వేంపల్లె..: వైఎస్సార్ జిల్లా పేరును వైఎస్సార్ కడప జిల్లాగా మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. వేంపల్లెలో ఆయన మీడియాతో ఆయన మాట్లాడారు.

కడప సెవెన్ రోడ్స్..: వైఎస్సార్ జిల్లా పేరును వైఎస్సార్ కడప జిల్లాగా మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపట్ల రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఓబులేసు, జి.ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి గాలిచంద్ర హర్షం వ్యక్తం చేశారు.ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతించాలన్నారు.

రూ.2500 కోట్లతో నగర అభివృద్ధి

కడప ఎర్రముక్కపల్లె, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో రూ.2500కోట్లతో నగరాభివృద్ధి చేయడం జరిగిందని కార్పొరేటర్ పాకా సురేష్, బాలస్వామిరెడ్డి తెలిపారు. నగర పాలక సంస్థ మూడో పాలకవర్గం ఏర్పడి నాలుగేళ్లు పూర్తయిందన్నారు. మంగళవారం కడప నగరం పాకా సురేష్ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రధానంగా కూడళ్ల అభివృద్ధి, రోడ్ల విస్తరణ పనులు, పార్కుల అభివృద్ధి, రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు చేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో వైసీపీ నేత రెడ్డివరకుమార్ పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్




ఇఫ్తార్ విందులో అమీర్‌బాబు

కడప కల్చరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ విందు నిలుస్తోందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీఎస్ అమీర్‌బాబు పేర్కొన్నారు. రంజాన్ మాసం సందర్భాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక అగాడివీధి, కేసీ కెనాల్ సమీప మియామస్జిద్ మత గురువు గౌస్‌సాహెబ్ ఆహ్వానం మేరకు ఇఫ్తార్ విందు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అఫ్జల్‌ఖాన్, ముస్లింలు పాల్గొన్నారు.

రంజాన్ మాసంలో దానధర్మాలు మోక్షానికి మార్గాలు..:పవిత్ర రంజాన్ మాసంలో పేద ప్రజలకు దానధర్మాలు చేయడం ద్వారా మోక్షా నికి సులభమైన మార్గమని వికాస్ స్కూలు ఆఫ్ ఇనిస్టిట్యూషన్ అధినేత సుభాన్‌బాషా పేర్కొన్నారు. రంజాన్ మాసం సందర్భంగా నగర 21, 30వ డివిజన్‌లలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు మంగళవారం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ వద్ద గల ఆయన కార్యాలయంలో దుస్తులు, నగదు ఉచితంగా అందించారు.

మతసామరస్యాన్ని కాపాడాలి



ఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కడప సెవెన్ రోడ్స్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రాయచోటి, చెన్నూరు సంఘ టనల నేపథ్యంలో జిల్లాలో మత సామరస్యం కాపాడాలని మంగళవారం అఖిలపక్ష కమిటీల మైనార్టీ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వివిధ రకాల మత పెద్దలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు జిల్లాలో మత సామరస్యం కాపాడాలని ఎస్పీకి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం ఫెడరేషన్ అధ్యక్షుడు మహమ్మద్,జాకీర్,మౌలానా, మత గురువు సిరాజ్ బుఖారి, ఆప్ కీ ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మక్బూల్ బాష, జిల్లా పాస్టర్ విజయభాస్కర్, ప్రసాద్, ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

అధ్వాన రోడ్లతో అవస్థలు

● మరమ్మతులు చేయాలంటూ జనం గగ్గోలు

పెద్దముడియం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): దారుణంగా దెబ్బతిన్న రోడ్లతో జనం పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో దెబ్బతిన్న రోడ్లకు తట్టెడు మట్టి పోసే నాధుడే కరువయ్యారు. దీంతో మండల వ్యాప్తంగా రోడ్లన్నీ గుంతలమయంగా దర్శనమిస్తున్నాయి. అయితే ప్రస్తుత ప్రభుత్వం వచ్చాక చాలా వరకు రోడ్లకు మరమ్మతులు చేపట్టారు. అయితే మండల పరిధిలోని భీమగుండం, నవాబుపేట, జంగాలపల్లె, పెద్దముడియం గ్రామాల మధ్య రహదారులు ఎందుకో మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో ఆయా గ్రామాల మధ్య రహదారులపై వాహనదారులు వెళ్లాలంటే జంకుతున్నారు. మండల కేంద్రమైన పెద్దముడియంకు వెళ్లేందుకు జె.కొట్టాలపల్లె, జంగాలపల్లె, ఉప్పలూరు గ్రామాల రైతులకు ఏవైనా ప్రభుత్వ కార్యాలయాల వద్దకు వెళ్లాలంటే పెద్దముడియం రహదారి ప్రధానమైనది. అయితే ఈ రహదారి పూర్తిగా పాడవకపోవడంతో వాహనదారులు నానా తంటాలు పడుతున్నారు. అలాగే భీమగుండం నుంచి నవాబుపేట వెళ్లే రహదారి కూడా చాలా వరకు దెబ్బతింది. ఆటోలు, కార్లు వెళ్లాలంటే వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఈ దెబ్బతిన్న రహదారుల్లో రాత్రుల్లో ప్రయాణించాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. అధికార యంత్రాంగం ఇప్పటికైనా దెబ్బతిన్న రోడ్లకు అవసరమైన మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.


దారుణంగా దెబ్బతిన్న బీమగుండం - నవాబుపేట రహదారి


కంకర తేలి వాహనాలు వెళ్లలేని స్థితిలో జంగాలపల్లె రోడ్డు

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

బద్వేలు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీనగర్, మడకలవారిపల్లి, పూసలవాడ, కోటవీధి, గుంతపల్లె సచివాలయాల్లో ఈ నెల 19- 22వ తేది వరకు, 25-28వ తేది వరకు ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి తెలిపారు. 0- 5 సంవత్సరాల వయసు గల పిల్లలకు కొత్త ఆధార్ నమోదు, ఆధార్ తీసుకుని పదేళ్లు దాటిన వారికి బయోమెట్రిక్ అప్‌డేట్, అడ్రస్ మార్పు, వయసు, పేరు మార్పు, ఫోన్ నంబర్ మార్పు వంటి సేవలను ఈ క్యాంపులలో అందిస్తున్నారని, పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆదరణ పథకానికి నమోదు చేసుకోండి

పోరుమామిళ్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన తరగతుల పరిధిలోని కుల వృత్తుల వారికి 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ రాష్ట్ర ప్రభుత్వం ఆదరణ పథకం కింద పనిముట్లు అందిస్తోందని అందుకు ఈ నెల 20న ఎంపీడీవో కార్యాలయ పరిధిలో బీసీలు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఎంపీడీవో రమణారెడ్డి తెలిపారు. నాయీబ్రాహ్మణులు, కార్పెంటర్లు, మత్స్యకారులు, స్వర్ణకారులు, కుమ్మరి, కమ్మరి, వడ్రంగి, రజకులు, టైలరింగ్, శిల్పకారులతో పాటు అన్నిరకాల సాంప్రదాయ చేతివృత్తుల వారు నమోదు చేసుకోవచ్చన్నారు.

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న ఎస్‌ఐ శ్యాంసుందర్‌రెడ్డి

మైలవరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మైలవరం ఎస్‌ఐ శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా దొడియం గ్రామంలో సోమవారం రాత్రి ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి గొడవలకు వెళ్లకుండా చిన్న చిన్న సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. ఫ్యాక్షన్ వలన జరిగే నష్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు ప్రశాంతంగా ఉండాలని సూచించారు.

307 మందికి అదనపు సాయం

పోరుమామిళ్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పక్కాగృహాలు మధ్యలో నిలిపివేసిన 307 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం అదనపు సాయం అందిస్తుందని ఎంపీడీవో రమణారెడ్డి తెలిపారు. పోరుమామిళ్ల పంచాయతీలో 107, రంగసముద్రం పంచాయతీలో 74, మిగిలిన పంచాయతీల్లో 126 మంది ఉన్నారని, వీరు త్వరగా ఇళ్లనిర్మాణం పూర్తి చేసుకోవాలన్నారు.

కొండాపురం: 2019-2024 సంవత్సరాల మధ్యకాలంలో పక్కాగృహాలు మంజూరై ఇల్లు కట్టుకోని లబ్ధిదారులకు ప్రభుత్వం అదనపు సాయం అందిస్తుందని ఎంపీడీవో నాగప్రసాద్, హౌసింగ్ ఏఈ గురురాజులు తెలిపారు. ఈ మధ్యకాలంలో ఇల్లు మంజూరై ఇల్లు కట్టుకోని బీసీ, ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, ప్రభుత్వం అదనంగా సహాయం అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మైదుకూరు రూరల్: అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు సాయం ఇస్తున్నారని, ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కేవీ శ్రీధర్‌నాయుడు మంగళవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. మండలంలో గునాది దశలో 135 ఇళ్లు, గోడల దశలో 105, కాంక్రీట్ దశలో 39 ఇళ్లు ఉన్నాయని, వారు ఏప్రిల్ నెల 20లోపు పూర్తి చేసుకున్న వారికి మాత్రమే ఈ అదనపు డబ్బులు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రాజేష్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు అదనపు సాయం

కాశినాయన, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలో అసంపూర్తిగా ఉన్న పీఎంఏవై, ఎన్టీఆర్ అసంపూర్తి గృహనిర్మాణ లబ్ధిదారులకు ప్రభుత్వం అదనపు సాయం అందించనున్నట్లు ఎంపీడీవో డా.మైథిలీరెడ్డి తెలిపారు. ఆ మేరకు పంచాయతీ సెక్రటరీలకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అసంపూర్తిగా ఉన్న గృహ లబ్ధిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఇంటి నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలని ఆమె కోరారు.

రోడ్డు పనులను పరిశీలించిన ఆర్డీవో


రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఆర్డీవో

బ్రహ్మంగారిమఠం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లేపల్లె పంచాయతీ సరిహద్దుల్లో బెంగుళూరు, విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే జాతీయ రోడ్డు పనులను, మైదుకూరు - పోరుమామిళ్ల ఫోర్‌లైన్స్ రోడ్డు పనులను బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా భూములు కోల్పోయిన లబ్ధిదారులకు నిర్ణీత సమయంలో ప్రభుత్వ సాయాన్ని అందించాలని మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి ఆర్డీఓను కోరారు. అలాగే భూములు కోల్పోయిన రైతన్నలు, ప్రజలు ఆర్డీవోతో మాట్లాడారు. ఈ విషయంపై ప్రభుత్వ సాయాన్ని వీలైనంత త్వరలో వచ్చే విధంగా చూస్తామని ఆర్డీవో హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు సాంబశివారెడ్డి, మేకల సుధాకర్, పూజా శివాయాదవ్, సురేంద్ర, నాగయ్య, గంగరాజు, ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ : కమిషనర్

ప్రొద్దుటూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బీసీ కార్పొరేషన్, కాపు, కమ్మ, రెడ్డి ఆర్యవైశ్య క్షత్రియ బ్రాహ్మణ కార్పొరేషన్లకు సంబంధించి మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మార్చి 22లోపు ప్రతి సచివాలయంలో ఏపీఓబీఎంఎంఎస్ ద్వారా కుట్టు శిక్షణ కావాల్సిన మహిళలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. 18-50 ఏళ్ల లోపు మహిళలు అర్హులని, ఆధార్‌తో పాటు కులధ్రువీకరణ పత్రం అందజేయాలన్నారు.

పునరావాస కాలనీల్లో నీటి సమస్య పరిష్కరించండి

కొండాపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కొండాపురంలోని పాత కొండాపురం, ఎస్సీకాలనీ పునరావాస కాలనీల్లో నీటి సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు, సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు కోరారు. మంగళవారం పంచాయతీ కార్యదర్శి శర్వాణికి వినతిపత్రం అందజేశారు. ఈ రెండు కాలనీల్లో గత వారం రోజులుగా నీటిసమస్య ఉందని తెలిపారు. పక్కనే గండికోట ప్రాజెక్టు ఉన్న తమకు నీటి సమస్య ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు మనోహర్‌బాబు, వెంకటరమణ, సుబ్బారావు, ప్రసాదు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం : శ్రీనాథ్‌రెడ్డి

ప్రొద్దుటూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో కడప జిల్లాను వైఎస్ఆర్ జిల్లాగా మార్చి జిల్లా ప్రజల మనోభావాలను దెబ్బతీశారని, ప్రస్తుత ప్రభుత్వం తిరిగి వైఎస్ఆర్ కడప జిల్లాగా పేరు మార్పు చేయటం హర్షణీయమని ఏపీ విభజన హామీల ప్రత్యేక హోదా సాధనసమితి అధ్యక్షుడు డాక్టర్ పాతకోట శ్రీనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక నెహ్రూరోడ్డులోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబునాయుడు, రాష్ట్ర మంత్రి మండలి తీసుకున్న ఈ నిర్ణయంపై హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

ఖాజీపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో వెంకటరమణ పరిశీలించారు. మంగళవారం కొత్తపల్లె పంచాయతీలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పంచాయతీని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో శానిటేషన్, తాగునీరు ప్రజలకు మంచిగా అందించాలని గ్రామంలో ఎక్కడా వ్యర్థ పదార్థాలు లేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో చంద్రశేఖర్, టెక్నికల్ అసిస్టెంట్, పంచాయతీ సెక్రటరి శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై డీఎల్‌పీవో, ఎంపీడీవో ఆరా


గొరిగెనూరులో మొక్కలు నాటుతున్న డీఎల్‌పీవో, ఎంపీడీవో, సర్పంచ్

జమ్మలమడుగు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొరిగెనూరు గ్రామాన్ని డివిజనల్ పంచాయతీ అధికారి తిమ్మక్క, ఎంపీడీవో సైదున్నీసా సందర్శించారు. ముందుగా గ్రామంలో మంచినీటి సరఫరాకు సంబంధించి పారిశుధ్యం తదితర వాటిలోని సమస్యలు గ్రామస్థులను అడిగారు. అనంతరం చెత్త సంపద కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మత్తయ్య, ఈవోపీఆర్‌డీ రామ్మోహన్‌రెడ్డి, తదితరులు గ్రామంలో సమస్యలపై చర్చించారు. ఎస్సీ కాలనీలో విద్యుత్ తీగెల సమస్యలపై మాట్లాడారు. అనంతరం స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, సర్పంచ్ మత్తయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

దేవస్థానం అభివృద్ధే లక్ష్యం

● మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి

బ్రహ్మంగారిమఠం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కాలజ్ఞానకర్త పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ప్రియశిష్యుడైన సిద్దయ్యస్వామిమఠం దేవస్థానం అభివృద్ధే ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ లక్ష్యమని మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి తెలిపారు. మంగళవారం దేవస్థానం ప్రాంగణంలో రూ.20 లక్షలతో జరుగుతున్న సీసీరోడ్లు, మరుగుదొడ్ల నిర్మాణం, వీధిలైట్లు, సెంటర్ ఫోకస్ లైట్లు, ప్రహరీగోడలు, డివైడరు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 30న సిద్దయ్యస్వామి ఆరాధన మహోత్సవాలు ఉన్నందున భక్తులు మఠానికి వస్తారని, భక్తుల సౌకర్యార్థం వెంటనే పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్ రమణయ్యకు సూచించారు. ఈ కార్యక్రమంలో మేకల సుధాకర్, చిలమల నాగయ్య, గంగరాజు, శివాయాదవ్, సాంబశివారెడ్డితో పాటు స్థానిక దేవస్థానం యాజమాన్యం సభ్యులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

కార్మికులకు టోపీలు, వాటర్ బాటిల్స్ అందజేయాలి

● కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన కార్మికులు


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రొద్దుటూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పారిశుధ్య కార్మికులతో పాటు ఇంజనీరింగ్ కార్మికులందరికి ఎండలు తీవ్రంగా వున్నందున టోపీతో పాటు ప్రతి కార్మికుడికి వాటర్ బాటిల్‌ను అందజేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు చంటి, కార్యదర్శి సాల్మన్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మల్లికార్జునను కలిసి కార్మికుల కోరికలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులందరికి యూనిఫాంతో పాటు పనిముట్లు ఇవ్వాలన్నారు. ఇందుకు కమిషనర్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు విజయ్‌కుమార్, రాఘవ, గుర్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన


చట్టాలపై అవగాహన కల్పిస్తున్న రాజంపేట, బద్వేలు ఏపీపీలు

పోరుమామిళ్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఫారెస్టు చట్టాల గురించి రాజంపేట, బద్వేలు ఏపీపీలు జానీ, ఉమాదేవిలు అవగాహన కల్పించారు. మంగళవారం స్థానిక అటవీ కార్యాలయ ఆవరణంలో ఫారెస్టు రేంజర్ రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో ఫారెస్టు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫారెస్టు రేంజర్‌తో పాటు సీనియర్ అసిస్టెంటు శ్రీనివాసరావు, సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు పాల్గొన్నారు.

పైడిపాలెం రిజర్వాయర్‌కు నీరు విడుదల

కొండాపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుండి గండికోట ఎత్తిపోతల పథకం ద్వారా పైడిపాలెం రిజర్వాయర్‌కు నీరు విడుదల చేస్తున్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. ప్రస్తుతం రోజుకు 300 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 23.62 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఈఈ తెలిపారు.

వైభవంగా వసంతోత్సవం

బద్వేలురూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లక్ష్మిపాలెంలో వెలసిన లక్ష్మిప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి వసంతోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి ధ్వజారోహణ కార్యక్రమం శ్రీదేవి, భూదేవి సమేత గ్రామోత్సవం జరిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి న్యూట్రీగార్డెన్ అవసరం

గోపవరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికి న్యూట్రీగార్డెన్ అవసరమని వ్యవసాయాధికారి ఎం.నాగరాజ అన్నారు. మండలంలోని బేతాయపల్లె రైతు సేవా కేంద్రంలో ఆయన మాట్లాడారు. అవసరమైనంత యూరియా రైతులకు అందుబాటులో ఉందని, రైతులు ఉపయోగించుకోవాలన్నారు. అలాగే రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేసి రిజిస్టర్లను పరిశీలించారు. రైతు సేవా కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రైతు, భూమి పాస్‌బుక్, ఆధార్, సెల్ నెంబరు తీసుకుని ఎరువులను విక్రయించి డిబిటి చేసి రిజిస్టరు ఎంటర్ చేసి ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. తదుపరి రాచాయిపేట ఆర్‌బీకేను సందర్శించారు. ఈ కార్యక్రమంలో గోపవరం మండల బాధ్య వ్యవసాయాధికారి బి.మాధురి, వ్యవసాయ విస్తరణాధికారులు ఓబయ్య విజయ్‌కుమార్, సుప్రియ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ప్రత్యూష, ప్రశాంతి, ఓబులేసు, అనసూయ పాల్గొన్నారు.

ప్రతి రైతు రిజిష్టర్ చేయించుకోండి: ఏడీఏ

ముద్దనూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యకు రిజిష్టర్ చేయించుకోవాలని ఏడీఏ వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. మండల పరిధి కమ్మవారిపల్లె గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా ఏడీఏ మాట్లాడుతూ రైతులు పండించిన కంది, శనగ పంటలు ప్రభుత్వం కల్పించిన మద్దతు ధరకు అమ్ముకునేందుకు రైతు భరోసా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అలాగే గ్రామంలో కోత జరిగే ఉల్లి పంటను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏవో వెంకటకృష్ణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో రెండు ఆవులు మృతి

● దహన సంస్కారాలు నిర్వహించిన సర్పంచ్



పోరుమామిళ్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ పరిధిలోని బలిజ కోట వీధిలో రెండు ఆవులు అనారోగ్యంతో మృతిచెందాయి. విషయం తెలుసుకున్న సర్పంచ్ యనమల సుధాకర్ స్పందించి మానవత్వం చాటుకున్నారు. మంగళవారం ఆయన పోరుమామిళ్లలోని రెండు ఆవులకు సాంప్రదాయ పద్ధతిలో పూజలు నిర్వహించి దహన సంస్కారాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో గ్రామస్తులు హాజరయ్యారు.

అందుబాటులోకి ఫింగర్ ప్రింట్ పరికరాలు

దువ్వూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సచివాలయాల సిబ్బందికి 129 ఫింగర్ ప్రింట్ పరికరాలు అందుబాటులోకి వచ్చినట్లు ఎంపీడీవో రామకృష్ణయ్య తెలిపారు. వివిధ సర్వే నిర్వహణకు, పెన్షన్లకు, బయోమెట్రిక్ హాజరు, బిల్లుల అప్‌లోడింగ్ లాంటి వాటికి ఇవి దోహదపడతాయన్నారు. ఆయా సచివాలయాల సిబ్బందికి వీటిని అందజేసినట్లు ఆయన చెప్పారు.